ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు


జిల్లా వార్తలు

శుక్రవారం 5 జనవరి 2024

నేడు రంగవల్లుల పోటీలు

ABN ఆంధ్రజ్యోతి

నెల్లూరు, కావలి, గూడూరులలో నిర్వహణ



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అభిమాన పాఠకులైన నారీమణుల కోసం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో శుక్రవారం ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన" సారథ్యంలో నెల్లూరులోని చందన బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ మైదానం, కావలిలో కార్పొరేషన్ రీడింగ్ రూమ్, గూడూరులోని సనత్‌నగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఈ పోటీలు జరగనున్నాయి. మధ్యాహ్నం న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేసి, అతిథులు బహుమతులు అందజేయనున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)



నెల్లూరు: ఆత్మకూరు బస్టాండ్ వద్ద మున్సిపల్ కార్మికుల నిరసన ర్యాలీ

ఇచ్చిన మాట నిలబెట్టుకో జగన్!

- సామాజిక సాధికారత అంటే మా హక్కులను కాలరాయడం కాదు
- భగ్గుమన్న మున్సిపల్ కార్మికులు
- నెల్లూరులో ప్రదర్శన, కావలిలో అరెస్ట్

నెల్లూరు (సిటీ), జనవరి 4 : జగన్.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడం, ఇచ్చిన హామీలపై మడమతిప్పడం మంచిదికాదు. ప్రతిపక్షంలో ఉన్న రోజులు గుర్తుచేసుకో..' అంటూ పారిశుధ్య కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ డిమాండ్ల సాధన కోసం వారు చేస్తున్న సమ్మె గురువారం నాటికి పదవ రోజుకు చేరుకుంది. నెల్లూరులోని నవాబుపేట జలకన్య కూడలి నుంచి ఏబీఎం మైదానం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాయడం సామాజిక సాధికారత అనిపించుకోదని స్పష్టం చేశారు. దళిత, గిరిజనుల పట్ల మొండి వైఖరితో వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. ఔట్‌సోర్సింగ్‌లో ఉన్న మున్సిపల్ వర్కర్లను పర్మినెంట్ చేసే వరకు ఉద్యమం కెరటంలా కొనసాగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో నాయకులు పెంచలనరసయ్య, అల్లాడి గోపాల్, సూర్యానారాయణ, చెంగయ్య, నరసింహ, కత్తి పద్మలు పాల్గొన్నారు.

● కావలిలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ప్రైవేటు కూలీల ద్వారా తొలగించే యత్నం చేశారు. అయితే, వీరిని పారిశుధ్య కార్మికులు అడ్డుకొని రోడ్డుపై బైఠాయించారు. కమిషనర్ ఫిర్యాదుతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని, కాసేపటికి విడుదల చేశారు. ఆత్మకూరు, కందుకూరులలోనూ సమ్మె కొనసాగుతోంది.




కావలిలో రోడ్డుపై బైఠాయించిన కార్మికులతో మాట్లాడుతున్న పోలీసులు

ఉద్యమాల పురిటిగడ్డ నెల్లూరు జిల్లా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిపై తిరుగుబాట్ల అడ్డాగా మారిపోయింది. తన మాటే శాసనంగా నాలుగున్నరేళ్లు అధికారం చెలాయించిన జగన్‌కు జిల్లా నుంచి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఆయన నాయకత్వాన్ని ధిక్కరించే స్థాయిలో వరుస తిరుగుబాట్లు ఎదురవుతున్నాయి. జిల్లాలో ముగ్గురు సిటింగ్ ఎమ్మెల్యేలు జగన్ ఆధిపత్యాన్ని ప్రశ్నించడంతో రాష్ట్రంలోని తిరుగుబాట్లకు తొలి బీజం పడింది. ఇక అంతా సర్దుకున్నదిలే అనుకున్న తరుణంలో కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ధిక్కారస్వరం వినిపించారు. ఐప్యాక్ బృందం, పార్టీ జిల్లా నాయకుల ద్వారా పంపిన సందేశాలను సున్నితంగానే తిరస్కరించారు. రాజకీయాల కోసం తన వ్యక్తిత్వాన్ని చంపుకొని రాజీపడనని, ఈ విషయంలో తగ్గేదే లేదని ఐప్యాక్ బృందం ద్వారా జగన్‌కు తన వాణి వినిపించారు. రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన ఈ విషయం జిల్లా వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది.


కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ధిక్కారస్వరం

జగన్‌కు మరో ఝలక్!

- చంద్రబాబు, లోకేష్‌లను తిడితేనే టికెట్ అన్న ఐప్యాక్ బృందం
- అకారణంగా తిట్టను.. టికెట్ విషయం ఆయన ఇష్టమన్న మహీధర్
- మొన్న ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, ఆనం, మేకపాటి!
- తిరుగుబాటుదారులందరూ జగన్ సామాజిక వర్గానికి చెందినవారే.!



నెల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాల వారీగా వైసీపీ అభ్యర్థులను ఖరారు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొంతమంది సిటింగ్ ఎమ్మెల్యేల విషయం ఎటూ తెల్చకుండా జగన్ హోల్డులో ఉంచారు. ఆ జాబితాలో కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి పేరు కూడా ఉంది. ఈయనకు టికెట్టు ఇవ్వాలని జిల్లా నాయకత్వం జగన్ దృష్టికి తీసుకొచ్చింది. అయితే, అభ్యర్థుల విశ్వసనీయతను లెక్కించే క్రమంలో చంద్రబాబును, లోకేష్‌ను తిట్టే వారే నమ్మకస్థులుగా వైసీపీ అధిష్ఠానం భావించినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రెస్‌మీట్ పెట్టి చంద్రబాబును, లోకేష్‌ను తిడితేనే విశ్వసనీయుడిగా గుర్తించి టికెట్టు ఇస్తామని రెండు రోజుల క్రితం ఆ పార్టీ జిల్లా నాయకుల ద్వారా మహీధర్‌రెడ్డికి సందేశం పంపినట్లు తెలిసింది. అయితే, దీనిని ఆయన పట్టించుకోలేదు. గురువారం మరోసారి ఐప్యాక్ బృందం మహీధర్‌రెడ్డిని కలవగా ఆయన కుదరదు అని ఖరాకండిగా చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఐప్యాక్ వెంటనే అధిష్ఠానానికి చేరవేసింది. మహీధర్‌రెడ్డి ధిక్కార స్వరాన్ని, తిరుగుబాటును వైసీపీ అధినాయకత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు చెబుతున్నారు. గురువారం సాయంత్రం కందుకూరుతో సత్సంబంధాలు కలిగిన కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను అమరావతికి పిలిచి రహస్యంగా చర్చించినట్లు సమాచారం.



ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

రోజు : గురువారం

స్థలం : కందుకూరు

విషయం : నెల్లూరుకు చెందిన వైసీపీ నేతతో కలిసి ఐప్యాక్ బృందం ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని కలిసింది. అసెంబ్లీ టికెట్టు విషయమై వారి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు..

ఐప్యాక్ : పార్టీ అధిష్ఠానం మమ్మల్ని మీ దగ్గరకు పంపింది. మీరు ఇవాళే ప్రెస్‌మీట్ పెట్టి టీడీపీ అగ్రనేతలు నారా చంద్రబాబు, లోకేష్‌లను తిట్టాలని ఆదేశించింది.

ఎమ్మెల్యే : అకారణంగా ఒకరిని తిట్టమని చెబితే నేను తిట్టేవాడిని కాను. నాది అలాంటి వ్యక్తిత్వం కాదు. ఈ మాట అధిష్ఠానానికి చెప్పండి.

ఐ ప్యాక్ : చంద్రబాబును, లోకేష్‌లను తిట్టని పక్షంలో టికెట్టు ఇవ్వకపోవచ్చు. ఆలోచించుకోండి.

ఎమ్మెల్యే : టికెట్టు విషయం ఆయన (జగన్‌రెడ్డి) ఇష్టం. ఇచ్చినా, ఇవ్వకున్నా సరే నేను మాత్రం అకారణంగా ఒకరిని తిట్టమంటే తిట్టే వ్యక్తిని కాదు. ఈ విషయాన్ని పార్టీ పెద్దలకే చెప్పండి.

● ఇది నాల్గవ షాక్!?

నెల్లూరు జిల్లా వైసీపీ నేతలు జగన్‌కు షాకుల మీద షాకులు ఇస్తున్నారు. కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిలు వైసీపీ అధినేత జగన్‌రెడ్డిపై తిరుగుబాటు ప్రకటించి పార్టీ నుంచి వెలుపలికి వచ్చారు. కొద్ది రోజుల వ్యవధిలోనే తెలుగుదేశం సాదర ఆహ్వానం మేరకు ఆ పార్టీలో చేరారు. వాస్తవానికి జగన్‌కు ఇది భారీ షాక్. ముగ్గురు బలమైన నాయకులు ఏకకాలంలో తిరుగుబాటు ప్రకటించి వెలుపలకు వచ్చిన కొద్ది రోజుల వ్యవధిలోనే జిల్లాకు చెందిన మరో బలమైన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి తిరుగుబాటు వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఉభయ తెలుగురాష్ట్రాల రాజకీయ వర్గాల్లో నెల్లూరు జిల్లా ప్రస్తావన మరోసారి మారుమోగుతోంది. విశేషమేమంటే ఇప్పటికి తిరుగుబాటు ప్రకటించిన ముగ్గురు ఎమ్మెల్యేలు, తాజాగా ధిక్కార స్వరం వినిపించిన మహీధర్‌రెడ్డి వీరందరూ జగన్ సామాజికవర్గానికి చెందినవారే కావడం ఒక విశేషమైతే, అందరూ వైఎస్ కుటుంబానికి వీర విధేయులుగా గుర్తింపు పొందిన నాయకులు కావడం మరో విషయం. ఆత్మాభిమానం కలిగిన ఏ నాయకుడు జగన్ వ్యవహార శైలిని జీర్ణించుకోలేరని చెప్పడానికి జిల్లాలో జరిగిన, జరుగుతున్న తిరుగుబాట్లను రాజకీయ వర్గాలు ఉదాహరణగా చూపుతున్నాయి.



పోలీసు స్పోర్ట్స్

ఓవరాల్ చాంపియన్ ఏఆర్ వింగ్

- ముగిసిన పోటీలు
- బహుమతులు అందజేసిన ఐజీ పాలరాజు

నెల్లూరు(క్రైం), జనవరి 4: నెల్లూరులోని పోలీసు కవాత్తు మైదానంలో జరుగుతున్న పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ గురువారంతో ముగిసింది. జిల్లాలోని ఐదు సబ్‌డివిజన్లు, ఏఆర్, హెచ్‌జీ, డీపీవో విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది స్పోర్ట్స్ మీట్‌లో ఉత్సాహంగ పాల్గొన్నారు. ఇండివిడ్యువల్ చాంపియన్‌షిప్ (మెన్)ను ఏఆర్ వింగ్‌కు చెందిన ఆర్ఎస్ఐ సురేష్ దక్కించుకోగా, ఇండివిడ్యువల్ చాంపియన్‌షిప్ (ఉమెన్)ను ఏఆర్ వింగ్‌కే చెందిన కానిస్టేబుల్ చందన దక్కించుకున్నారు. మొత్తం మీద ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను నెల్లూరు ఏఆర్ వింగ్ కైవసం చేసుకుంది. గురువారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోలీస్ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం ద్వారా సంపూర్ణ శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, ఫిట్‌నెస్ లభిస్తాయని చెప్పారు. ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. ప్రతి మనిషి జీవితంలో ఏదో ఒక వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. క్యాంప్ ఫైర్ వెలిగించి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

13న జిల్లా క్రికెట్ లీగ్‌కు ఎంపికలు

నెల్లూరు (విద్య), జనవరి 4 : ఈనెల 13వతేదీ ఉదయం 9 గంటలకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-17, 23 జిల్లా క్రికెట్ లీగ్ పోటీలకు జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. లీగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు అంతర్‌జిల్లాల పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు.

చట్టప్రకారమే అంగన్‌వాడీల సమ్మె

- వీరిని తొలగించే అధికారం ఎవరికీ లేదు!
- 9వ తేదీలోపు సమస్యలు పరిష్కరించాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు
- జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె





నెల్లూరులో అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

నెల్లూరు (వైద్యం) జనవరి 4 : అంగన్‌వాడీలు చట్ట ప్రకారమే సమ్మె చేస్తున్నారని వారిని తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగ రావు స్పష్టం చేశారు. గురువారం నెల్లూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ డిమాండ్లపై ప్రభుత్వంతో అనేక దఫాలు చర్చలు జరిపినా ఫలితం లేదని చెప్పారు. సమ్మె విరమించకుంటే అందరినీ డిస్మిస్ చేస్తామని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ విజయలక్ష్మి చెప్పారని, చట్టం ఉల్లంఘించి డిస్మిస్ చేయాలంటే ఆ డిస్మిస్ కాగితాలు నాలుక గీసుకోటానికి కూడా పనికిరావని ఎద్దేవా చేశారు. ఇలాంటి బెదిరింపులు మాని అంగన్‌వాడీలతో సామరస్య చర్చలు జరపాలని సూచించారు. లేదంటే ఈ నెల 9న అన్ని కార్మిక సంఘాలు, వివిధ యూనియన్లతో పెద్ద ఎత్తున తరలి వచ్చి అంగన్‌వాడీలకు మద్దతుగా నిలుస్తామని హెచ్చరించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యద ర్శులు దుర్గిరాల సూరిబాబు, సుదర్శన్ రెడ్డిలకు అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, కొండా ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ నేతలు కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి, సుమతి, ఉషా, కల్పన, నాగభూషణమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు కావలి, ఆత్మకూరు, కందుకూరు, ఉదయగిరి, అనంతసాగరం, కోవూరు తదితర ప్రాంతాల్లోనూ సమ్మె కొనసాగుతోంది.

రహదారులను కమ్మేస్తున్న పొగమంచు

ఎదుట వాహనాలు కనిపించక ప్రమాదాలు

ఏమరుపాటు వద్దంటున్న నిపుణులు



జాతీయ రహదారిపై లైట్ల వెలుగుల్లో వస్తున్న వాహనం

మంచుదుప్పటి ముంచునేమో!

నెల్లూరు (స్టోన్ హౌస్ పేట), జనవరి 4 : ఎటు చూసినా మంచు.. కనీసం పది మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తి కూడా కనిపించనంత స్థాయిలో పొగమంచు కప్పేస్తోంది. ఉదయం 8 గంటలకు కూడా భాను డు మంచు తెరల నుంచి బయటకు రానంటున్నాడు. చలిపులిని తట్టుకోలేక ప్రజలు గడపదాటి బయటకు రావడం లేదు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వస్తున్న వాహనదారులకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లాలో కోల్‌కత్తా- చెన్నై, నెల్లూరు-బద్వేలు, సింగరాయకొండ - కందు కూరు, ఏర్పేడు-నకిరేకల్ జాయతీ రహదారులు ఉన్నాయి. వీటితో పాటు ఉన్న రాష్ట్ర, జిల్లాస్థాయి రహదారులు ఉన్నాయి. పొగమంచు కారణంగా అవసరం ఉంటేనే ప్రయాణాలు చేయాలని, వాహన డ్రైవింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

● ఇష్టానుసారంగా పార్కింగ్‌లు

పొగమంచు కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో 50 శాతానికిపైగా ఆగిఉన్న వాహనాలను ఢీకొనడం ద్వారానే. జాతీయ రహదారుల పక్కన నిలిపి ఉన్న వాహనాలు మంచులో కనిపించక పోడంతో వెనుక నుంచి వాటిని ఢీకొని ప్రయాదాలు అధికంగా జరుతున్నాయి. ప్రమాదాల నివారణకు తాము సూచించిన రెస్ట్ ఏరియాలోనే వాహనాలు పార్కింగ్ చేయాలని హైవే అథారిటీ అధికారులు సూచిస్తున్నారు.

● డిసెంబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు జిల్లాలో పొగమంచు అధికంగా ఉంటుంది. దట్టమైన పొగమంచులో వెళ్లేటప్పుడు కారులోని విపత్తు హెచ్చరికల లైట్లు ఆన్‌చేయాలి. ఇలా చేయడం ద్వారా రహదారి మీద మన కారు ఉనికిని ఇతర వాహనదారులు గుర్తించే అవకాశం ఉంటుంది.

● పొగమంచులో వెళ్లే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ చేతులను ఎప్పుడూ స్టీరింగ్ మీదనే ఉంచాలి. మలుపుల్లో వెంటనే స్పందించి స్టీరింగ్ తిప్పుతూ అదుపు చేసేలా ఉండాలి. ఇవన్నీ జరగాలంటే తక్కువ వేగంతో వాహనం నడిపితేనే సాధ్య మవుతుంది.

● జాతీయ, రాష్ట్ర రహదారులపై ఉన్న రేడియం లైనింగ్ గుర్తులను అనుసరిం చాలి. వంతెనలు, ఇరుకైన రోడ్డు ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తెలుపు, పసుపు రంగుల్లో రోడ్డు మార్కులను గమనించాలి.

● కారులో డీ ఫాగర్‌ను ఆన్ చేసుకోవడం వల్ల అద్దాలపై పేరుకుపోయిన మంచు కరిగిపోతుంది.

● డ్రైవింగ్‌లో ఏకాగ్రత కోసం వాహనంలో మ్యూజిక్ సౌండ్ తక్కువగా, వీలైతే ఆఫ్ చేయడం ఉత్తమం. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. ముందు వెళుతున్న వాహనానికి కనీస దూరం పాటించాలి.

● వాహనాల హెడ్‌లైట్ల పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ఒక లైటు మాత్రమే పని చేస్తున్నా, లైట్లలో వెలుగు తక్కువ ఉన్నా ప్రయాణం వాయిదా వేసుకోవడం ఉత్తమం.



హైవేను కమ్మేసిన పొగమంచు

అత్యవసరమైతేనే ప్రయాణించండి



పొగమంచు అధికంగా ఉన్న సమయంలో అత్యవ సరం అనుకుంటేనే ప్రయాణాలు చేయండి. డ్రైవింగ్‌పై ఏకాగ్రతతో తక్కువ వేగంతో వాహనం నడపాలి. రోడ్డు పూర్తిగా మంచుతో కమ్మేసి ఉంటే వాహనాలను రెస్ట్ ఏరియాలో పార్క్ చేసుకోవడం మంచిది. రోడ్డు పక్కన వాహనాలు ఆపుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

- చందర్, డీటీసీ

ఇండియా సో బ్యూటిఫుల్..



ఇండియా సో బ్యూటిఫుల్... గ్రేట్... గుడ్ కల్చర్.. ట్రెడిషన్.. వావ్ అంటున్నారు ఈ చిత్రంలో కనిపిస్తున్న విదేశీ యువకులు. వీరంతా ఒక్కో దేశంకు చెందిన వారు. ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్ ద్వారా స్నేహితులయ్యారు. ఆరుగురు కలిసి ఇండియా అంతా చుట్టి పర్యాటక ప్రదేశాలు చూడాలని గత నెల 26న కేరళకు వచ్చారు. అక్కడ రెండు ఆటోలు కొనుగోలు చేసి జనవరి 1న రిక్షా రన్ ఇండియా 2024 పేరుతో యాత్ర చేపట్టారు. యాత్ర గురువారం మనుబోలు జాతీయ రహదారికి చేరుకుంది. కాగితాల పూరు క్రాస్ రోడ్డు వద్దనున్న మెక్‌డోనాల్డ్స్ బర్గర్ దుకాణానికి అల్పాహారం కోసం వచ్చారు. ఈ సందర్భంగా ఇండియా గురించి విదేశీ యువకులు వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పగలంతా ఆటోలో తిరుగుతూ రాత్రి సమయాల్లో హోటల్, రెస్టారెంట్లలో సేదతీరుతున్నట్లు తెలిపారు.

\- మనుబోలు

ఎన్‌డీసీసీబీలో 'సహకార నేస్తం'

- నూతన డిపాజిట్ పథకం ప్రారంభం



సహకార నేస్తం పథకాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జవనరి 4 : నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అత్యధిక వడ్డీని ఇచ్చే సహకార నేస్తం అనే నూతన డిపాజిట్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకాన్ని ఆ బ్యాంకు చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సీఈవో ఎస్ శ్రీనివాస రావుతో కలిసి సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ సహకార నేస్తం పథకంలో 7.75 శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.50 శాతం వడ్డీ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ బ్యాంకు జీఎం సరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు గొర్రెల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికలు

- చైర్మన్ పదవికి ముగ్గురు పోటీ
- 36 నామినేషన్లు.. 124 మంది ఓటర్లు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 4 : నెల్లూరు జిల్లా గొర్రెల ఉత్పత్తిదారుల సహకార సంఘం లిమిటెడ్ పాలక వర్గం ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. నెల్లూరు రైల్వే ఫీడర్స్ రోడ్డులోని జిల్లా పశుసంవర్థకశాఖ కార్యాలయ ప్రాంగణంలో గల సమావేశ మందిరంలో ఈ ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, జిల్లా సహకారశాఖాధికారి బీ సుధాభారతి అన్ని చర్యలు తీసుకున్నారు. గొర్రెల ఉత్పత్తిదారుల సహకార సంఘం పాలకవర్గ చైర్మన్ పదవికి ముగ్గురు పోటీలో ఉన్నారు. రెండు పార్టీలు, ఇతర నియోజకవర్గాల్లోని నాయకుల అనుచరులు పోటీలో ఉండటం సాధారణం. అయితే ఇక్కడ పోటీలో ఉన్న ముగ్గురూ ఒకే నియోజకవర్గం నుంచి అది కూడా జిల్లా మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గానికి చెందిన వారే కావడంతో ఎన్నికలకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ ముగ్గురు, వారికి మద్దతిచ్చే మరో 11 మందితో కలిసి ఒక్కొక్కరు 12 నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 36 నామినేషన్లను అధికారులు స్వీకరిం చారు. పొదలకూరు మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన గోగుల పెంచలయ్య, ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామానికి చెందిన మేకల సాయికృష్ణ, వెంకటాచలం మం డలం చెముడుగుంట గ్రామానికి చెందిన మాజీ చైర్మన్ గుమ్మడి అరుణమ్మ చైర్మన్ పోటీలో ఉన్నారు. జిల్లాలో మొ త్తం 160 సహకార సంఘాలున్నాయి. అందులో 36 మంది పోటీలో ఉండగా మిగిలిన 124 మంది ఓటర్లుగా ఉంటారు. 36 మంది పోటీదారుల్లో ఎక్కువ మంది మద్దతు పొందిన 12 మంది పోటీలో నిలుస్తారు. వారు చైర్మన్‌ను ఎన్నుకుంటారు. పోటీలో ఉన్న అభ్యర్థి క్రమ సంఖ్య, పేరు చదివిన తరువాత ఓటర్లు వారి చేతులు ఎత్తి మద్దతు తెలియజేస్తారు.

పరిహారం ఇవ్వకుంటే టవర్‌పై నుంచి దూకేస్తా !

- ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంపై రైతు మండిపాటు

ముత్తుకూరు, జనవరి 4 : ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో మనస్తాపం చెందిన ఓ రైతు టవర్ పైకెక్కి ఆత్మహత్య చేసుకుంటానని భీష్మించిన సంఘటన పైనంపురంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పైనం పురం ఎస్సీ కాలనీకి చెందిన పెడకాల రమణయ్య పైనంపురం రెవెన్యూలోని సర్వే నెంబరు 289లోని తమ ఆధీనంలోని భూమిలో 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నాడు. సదరు భూమికి ట్రాన్స్‌కో అధికారులు పరిహారం ఇవ్వకుండా హైటెన్షన్ టవర్ నిర్మిస్తుండగా గతవారం టవర్ నిర్మాణ పనులు జరగకుండా అడ్డుకు న్నారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులు వచ్చి న్యాయం చేస్తామని, అప్పటివరకు పనులు జరగని వ్వాలని కోరిన మీదట పనులు చేసేందుకు అంగీకరించారు. కాగా, గురువారం అడిగితే సమాధానం చెప్పకపోవడంతో మనస్తాపం చెందిన రమణయ్య న్యాయం చేయకపోతే టవర్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని, 100 అడుగులు ఎత్తు ఉన్న టవర్ పైకి ఎక్కి కూర్చున్నాడు. సమాచారం అందుకున్న జెన్‌కో థర్మల్ కేంద్రం, ట్రాన్స్‌కో అధికారులు, కృష్ణపట్నం ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరిస్తామని, చర్చించుకుందామని టవర్‌పై నుంచి దిగాలని కోరారు. అయితే పరిహారం విషయంలో తనకు స్పష్టమైన హామీ ఇవ్వకపోతే టవర్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని రమణయ్య భీష్మించుకున్నాడు. దీంతో వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో అధికారులు హామీ ఇవ్వడంతో రమణయ్య టవర్‌పై నుంచి కిందకు దిగాడు.

వంగల్లు భీమేశ్వరాలయంలో అమ్మవారి బంగారు కాసుల హారం మాయం

- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

సంగం, జనవరి 4: మండలంలో దేవాదాయశాఖ పరిధిలోని వంగల్లు భీమేశ్వరాలయానికి చెందిన సుమారు రూ. 6 లక్షల విలువ చేసే 82 గ్రాముల బంగారు కాసుల హారం మాయమైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల మేరకు.. వంగల్లులో భీమేశ్వ రాలయంలోని శ్రీకామాక్షిదేవికి చెందిన సుమారు 82 గ్రాముల పురాతన బంగారు కాసుల హారం ఉంది. ఈ కాసుల హారంతోపాటు ఆలయానికి చెందిన మరికొన్ని ఆభరణాలను ఈవో పేరుతో బుచ్చిరెడ్డిపాళెంలోని కెనరా బ్యాంకులో ఉండే లాకర్‌లో భద్రపరుస్తారు. లాకర్‌లో భద్రపరిచిన కాసుల హారాన్ని ప్రతి ఏటా జరిగే మహాశివరాత్రి రోజు తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించి మరుసటి రోజు మళ్లీ లాకర్‌లో భద్రపరచడం ఆనవాయితీ. అయితే 2018లో జరిగిన మహాశివరాత్రి వేడుకలకు కాసుల హారం తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు. అప్పట్లో సంగం గ్రామానికి చెందిన ఎస్ నవీన్ కుమార్ ఈవోగా ఉన్నారు. ఆయన తరువాత 2019 ఏప్రిల్‌లో ఈవోగా వచ్చిన సుధాకర్‌కు అప్పగించిన చార్జ్‌లో కాసుల హారం కూడా ఉంది. ఆయన తరువాత వచ్చిన రమేష్‌రెడ్డికి కూడా అప్పగించిన చార్జ్‌లో కాసుల హారం ఉంది. కాగా, రమేష్‌రెడ్డి బదిలీపై వెళ్తూ ఈవోగా వచ్చిన శ్రీలతకు అప్పగించిన రికారుల్లో కాసుల హారం లేదు. దీంతో ఈవో రమేష్ కాలంలో 82 కాసుల బంగారు హారం మాయమైయినట్లు తేలింది. దీనిపై ఈవో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	95
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	180
స్కిన్‌లెస్	200
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5983
వెండి కిలో ధర	రూ. 73,700
వెండి ఒక గ్రాము	రూ. 75.70

వర్క్ ఇన్‌స్పెక్టర్ అవినీతిపై విజిలెన్స్ అధికారుల విచారణ

ఉదయగిరి రూరల్, జనవరి 4: ఉదయగిరి గృహ నిర్మాణ శాఖలో పేద లకు పంపిణీ చేయాల్సిన సిమెంట్ పక్కదారి పట్ట డంపై గురువారం విజ యవాడ విజిలెన్స్ అధికా రులు విచారణ చేపట్టారు. ఇటీవల ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేదలకు పంపిణీ చేయాల్సిన సిమెంట్‌ను ఓ వర్క్ఇన్‌స్పెక్టర్ తన సొంత ఇంటి నిర్మాణానికి వాడడాన్ని గుర్తించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపట్టాలని సూచించారు. అందులో భాగంగా విజిలెన్స్, హౌసింగ్ అధికారులు సిమెంట్ గోదాముతో పాటు ప్రభుత్వ సిమెంట్‌తో నిర్మిస్తున్న ఇంటిని, కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాల యంలో విజిలెన్స్ ఈఈ భాస్కర్‌రావు, డీఈ చంద్రశేఖర్ రాజులు మాట్లాడుతూ గోదాముల్లో సిమెంట్ నిల్వలతోపాటు వర్క్ఇన్‌స్పెక్టర్ ఇంటి నిర్మాణాన్ని, కార్యాలయంలో రికార్డులను పరిశీలించామన్నారు. పరిశీలనలో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ దయాకర్, ఇన్‌చార్జి డీఈ రామకృష్ణ, ఏఈ వీరా, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత ఎంపీపీనని అవమానిస్తున్నారు..!

- జేసీకి రాపూరు ఎంపీపీ ప్రసన్న ఫిర్యాదు

నెల్లూరు(హరనాథపురం) : తనను అవమానాలకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాపూరు ఎంపీపీ కే ప్రసన్న జేసీ రోణంకి కూర్మనాథ్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఎంపీపీగా పనిచేసిన చెన్ను బాలకృష్ణారెడ్డి తమ ప్రియతమ నాయకుడని, ఆయన చిత్రపటాన్ని మండల కమిటీ ఆమోదంతో తన కార్యాలయంలోని టేబుల్ పై ఉంచానన్నారు. మంగళవారం తన అనుమతి లేకుండా ఆ ఫొటోను తొలగించారని ఆరోపించారు. దళితురాలినని గౌరవం ఇవ్వకుండా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి కారకులపై చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు.

ఆర్టీసీ కార్పొరేషన్‌కు 1500 కొత్త బస్సులు



ఉదయగిరి ఆర్టీసీ డిపో గ్యారేజీని తనిఖీ చేస్తున్న ఈడీ

ఉదయగిరి, జనవరి 4: ఈ ఏడాది ఆర్టీసీ కార్పొరేషన్ 1500 కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు నెల్లూరు జోన్-3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ ఆదాం సాహెబ్ తెలిపారు. గురువారం ఉదయగిరి ఆర్టీసీ డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, నరసరావుపేట, గుంటూరు జిల్లాల్లోని అన్ని డిపోలకు ఏసీ, సూపర్‌లగ్జరీ, లగ్జరీ 420 బస్సులను కేటాయించడం జరుగుతుందన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మామూలు చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడపటం జరుగుతుందన్నారు. శుభకార్యాలకు, శబరిమలై యాత్రలకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరు బీ శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ చిరంజీవరావు, డిపో మేనేజర్ ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలలో నలుగురి డిబార్

వెంకటాచలం, జనవరి 4 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో గురువారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలలో నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు వర్సిటీ పరీ క్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 38 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో నెల్లూరులోని వీఆర్ ఐఏ ఎస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, రావూస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు మొత్తం నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు తెలిపారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి



మాట్లాడుతున్న వెంకగళరావు యాదవ్

కావలిటౌన్, జనవరి4: రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ పేర్కొన్నారు. బీసీ రాజ్యాధికార యాత్ర గురువారం కావలికి చేరుకుంది. మున్సిపల్ మాజీ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో యాత్రకు ఘన స్వాగతం పలికారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. విశిష్టఅతిథిగా పాల్గొన్న ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రమణ్యం జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంగళరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగటం లేదని అంటూనే అగ్రవర్ణాలే రాజ్యాధికారం హస్తగతం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఒకే కులానికి చెందిన 55 మంది తెలంగాణాలో ఎమ్మెల్యేలు అయ్యారని తెలిపారు. నేతలు అవినీతి, అక్రమాలకు పాల్పడి వేలాది కోట్లు సంపాదనతో ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకురాలు నూకాలమ్మ, జాతీయ కన్వీనర్ వై నాగేశ్వరరావు, ఇతర నాయకులు వెంకట రామరాజు, నాయుడు రాంప్రసాద్, పులి రజని, ద్రోణాదుల వెంకట్రావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైం), జనవరి 4: అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురి చేస్తున్న భర్త, అత్తింటివారిపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఏసీ నగర్ ఆటోస్టాండ్ సమీప ప్రాంతానికి చెందిన సుమతికి రెండేళ్ల కిందట చిట్టమూరు మండలానికి చెందిన మహేష్‌తో వివాహమైంది. పెళ్లి సమయంలో ఆమె తల్లిదండ్రులు రూ.5లక్షల నగదు, ఆరు సవర్ల బంగారాన్ని కట్నంగా ఇచ్చారు. కొద్ది రోజులు సుమతి, మహేష్ దాంపత్యం సంతోషంగా సాగింది. ఆ తర్వాత భర్త అత్తింటివారు ఆమెను అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించారు. కొంత కాలం కిందట సుమతి తన తండ్రికి అనారోగ్యంగా ఉండటంతో చూసేందుకు పుట్టింటికి వచ్చింది. తండ్రిని చూసి అత్తింటికి వెళ్లగా వారు అదనపు కట్నం తీసుకువస్తేనే కాపురానికి రావాలని వేధించారు. ఆ వేధింపులు తాళలేని బాధితురాలు గురువారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9న చంద్రబాబు సభకు విస్తృత ఏర్పాట్లు

- వెంకటగిరిలో భారీ జన సమీకరణ
- టీడీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

రాపూరు (డక్కిలి), డిసెంబరు 4 : మహానాడును తలపించే రీతిలో వెంకటగిరిలో టీడీపీ అదినేత నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభ ఉంటుందని, ఆ మేరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. 'రా... కదలిరా' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీన చంద్రబాబు వెంకటగిరికి వస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం గురువారం రాపూరులో కలువాయి, సైదాపురం, రాపూరు మండలాల టీడీపీ నాయకులతో కురుగొండ్ల సమీక్షించారు. చంద్రబాబు సభను జయప్రదం చేసేందుకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. వెంకటగిరి క్రాస్‌రోడ్డు సమీపంలో 7 ఎకరాల విస్తీర్ణంలో బహిరంగ సభ జరుగుతుందని, సుమారు లక్ష మందికిపైగా జన సమీకరణ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి మండలం నుంచి వేలాదిగా జనసమీకణ చేయాలని నాయకులకు లక్ష్యాన్ని నిర్థేశించారు. అనంతరం మండలాల వారీగా నాయకులకు జనసమీకరణ బాధ్యతలను అప్పగించారు. ఈ సమీక్షలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు జెన్ని రమణయ్య, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తోటా కృష్ణయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జోరేపల్లి వెంకటేశ్వర్లు రెడ్డి, కొండ్లపూడి రాఘవరెడ్డి, నువ్వుల శివరామకృష్ణ, ఏదోటి కోటేశ్వరనాయుడు, డాక్టర్ వేణుగోపాల్, పచ్చిగళ్ళ రత్నయ్య, సుబ్రమణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

మైపాడు రోడ్డుకు రేపు రివర్స్ టెండరింగ్

నెల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు-మైపాడు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు సంబంధించిన రివర్స్ టెండరింగ్ ప్రక్రియ శనివారం జరగనుంది. కేంద్ర రోడ్లు, మౌలిక వసతుల నిధి (సీఆర్‌ఐఎఫ్) కింద రూ.35.82 కోట్లతో చేపడుతున్న ఈ పనులకు నవంబరు 24న టెండర్లు ఆహ్వానించారు. మొత్తం ఐదు మంది కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు చేశారు. సాంకేతిక పరిశీలన అనంతరం ఈ ఐదుగురు రివర్స్ టెండరింగ్‌కు అర్హత సాధించినట్లు అధికారులు నిర్ధారించారు. వీరంతా రివర్స్ టెండరింగ్‌లో పాల్గొననున్నారు. రాష్ట్ర నిధులతో చేపడుతున్న రోడ్లకు టెండర్లు వేసేందుకు ముందుకురాని కాంట్రాక్టర్లు కేంద్ర నిధులు కావడంతో ఎక్కువగా పోటీకి వచ్చారు. దీంతో టెండర్ ఎంత ధరకు ఖరారవుతుంది..? అన్నది ఆసక్తిగా మారింది.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కావలిటౌన్: శిబిరంలో మాట్లాడుతున్న విజయకుమార్



ఆత్మకూరు : నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కావలిటౌన్, జనవరి 4: ప్రభుత్వానికి కార్మిక, కర్షక, ప్రజా సమస్యలు పట్టడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గండవరం విజయకుమార్ ఆరోపించారు. ఆర్డీవో కార్యాలయం ఎదురుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలు న్యాయమైన సమస్యల పరిష్కారం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా పాలకులు దిగిరాకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, రఘురావమ్మ, విజయలత, సీఐటీయూ నాయకులు పెంచలయ్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. స్థానిక అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారం కూడా కొనసాగగా కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎస్కే రహంతున్నీషా, రాజేశ్వరి తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళనలు కొనసాగుతాయన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు, నిర్బంధాలకు లొంగే ప్రశ్నేలేదని స్పష్టం చేశారు.

ఆత్మకూరు: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. గురువారం వారు విధులను బహిష్కరించి స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. వీరికి మద్దతుగా సీఐటీయు నాయకులు ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం అన్యాయని సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నినాదాలతో కూడిన నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు చాంద్‌బేగం, ప్రమీలా, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం: స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట గురువారం అంగన్‌వాడీల నిరసన కార్యక్రమం జరిగింది. తమ డిమాండ్‌లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో జేవీవీ నాయకులు గాడి సుధాకర్, వేము పెంచలయ్య, సీఐటీయూ నాయకులు అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ నిలబెట్టుకోమని ముఖ్యమంత్రికి చెప్పండయ్యా..

వరికుంటపాడు: తమ వేతనాలను పెంచుతానని ఎన్నికల సమయంలో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మీరైనా చెప్పడయ్యా అంటూ గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని అంగన్‌వాడీ కార్యకర్తలు వేడుకున్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు షేక్ రజియా ఆధ్వర్యంలో సమస్యను విన్నవించుకునేందుకు మూకుమ్మడిగా అక్కడికి చేరుకున్న కార్యకర్తలను పోలీసులు అడ్డుకొని ఆంక్షలు విధించినప్పటికీ లెక్కచేయకుండా ఒక్కసారిగా ఆయన వద్దకు చేరుకొని వినతిపత్రం అందచేశారు. కాగా వినతిపత్రం అందుకున్న ఆయన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

ఉదయగిరి రూరల్, జనవరి 4: స్థానిక భవిత కేంద్రంలో గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ద్వారా దృష్టిలోపం గల విద్యార్థినికి ట్యాబ్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కలీం, రామకృష్ణారెడ్డి, ఐఆర్పీలు సుభాస్‌చంద్రబోష్, శివ, నందిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శకునాలపల్లిలో గ్రామసభ

ఉదయగిరి రూరల్, జనవరి 4: మండలంలోని శకునాలపల్లి పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ అభివృద్ధికి అవసరమైన తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 4: మండలంలోని నందిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణంపై తన సిబ్బందితో దాడులు నిర్వహించనట్లు ఎస్ఐ ఉమాశంకర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ దాడుల్లో 12 మద్యం సీసాలతోపాటు నిర్వాహకున్ని అదుపులోకి తీసుకొన్నామన్నారు.

మర్రిపాడు: బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదుచేసి గురువారం కోర్టుకు హాజరు పరిచారు. పోలీసుల వివరాల మేరకు... నందవరం, రాంపల్లిలో అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వ హిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించి, నందవరంలో కొండమ్మ అనే మహిళ నుండి 22 మద్యం సీసాలు, రాంపల్లిలో శ్రీనివాసులు నుండి 4 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వరికుంటపాడు, జనవరి 4: ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుడు మల్లంపాటి మోహనరావు కుటుంబానికి గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. శాఖ జిల్లా కార్యదర్శి ఆర్ నాగార్జున మాట్లాడుతూ తమవంతు చేయూతగా కుటుంబ సభ్యులకు రూ. 1.25లక్షల నగదు చెక్కును అందజేశామన్నారు. కుటుంబ సంక్షేమ డైరక్టర్ కరీముల్లా, మేడసాని సుబ్బారావు, ఎల్వీ నారాయణ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం : బొల్లినేని



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బొల్లినేని

ఉదయగిరి రూరల్, జనవరి 4: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం అని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. గురువారం ఉదయగిరి పట్టణంలోని తుపాన్‌నగర్, దేవలాలగడ్డ తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజాదీవెన యాత్ర చేపట్టి ఇంటింటికి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, సందానీ, సజిల్, ఖాన్‌సా, మాబాషా, బొజ్జా నరసింహా, శివకృష్ణ, ఖాదర్‌బాషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

వింజమూరు, జనవరి 4: స్థానిక ఐదో ఆర్‌బీకేలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీడీపీఎం అడిషనల్ డీపీఎం మాలకొండయ్య, మునిరత్నంలు రైతులకు, వ్యవసాయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ చంద్ర, ఎంపీటీ అంజనరెడ్డి, హజరత్, సుజాత, వినోద్, ఇతర వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్డీవో

చేజర్ల, జనవరి 4: మండలంలో పలు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆత్మకూరు ఆర్డీవో కె మధులత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండల అధికారులు ఇచ్చిన వివరాల మేరకు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పుట్టుపల్లి, గొల్లపల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు లేకపోవడంపై జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వాలని తహసీల్దారును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పి క్రిష్ణ, ఆర్ఐ సుమతి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ఆత్మకూరు, జనవరి 4 : పట్టణంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11-30 గంటల నుంచి 1-30 వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి జనార్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూరు, ఉదయగిరి సబ్ డివిజన్ల పరిధిలోని అన్ని సెక్షన్లకు సంబంధించి విద్యుత్ అదాలత్ జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ దేవసేనమ్మ

ఆత్మకూరు, జనవరి 4 : ప్రైవేట్ డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ హెచ్చరించారు. గురువారం ఆమె ఆత్మకూరు పట్టణం, మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 64 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 74 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ ఫార్మర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, మండల వ్యవసాయశాఖాధికారి కె కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

సంగం, జనవరి 4: స్థానిక తుంగా దయాకర్‌రెడ్డి కల్యాణ మండపంలో గురువారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. కాగా, పంచాయతీకి ఒకరికి చొప్పున పంపిణీ చేసి మిగిలినవారికి శుక్రవారం నుంచి గ్రామాల్లో వలంటీర్లు ఇస్తారని తెలిపారు. దీంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నూతన పింఛన్లు ఒక్కటి కూడా ఇవ్వలేదు. దీంతో కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు తమకు పింఛన్ వస్తుందని ఎంతో ఆశగా సమావేశానికి వచ్చి నిరాశకు గురయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, జడ్పీటీసీ రాజేశ్వరమ్మ, ఎంపీపీ పద్మజారెడ్డి, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ కాటంరెడ్డి నరసింహరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సందాని, నాయకులు జిలాని బాషా, కోటిరెడ్డి, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు (ఉదయగిరి రూరల్) : అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, సొసైటీ అధ్యక్షులు మండ్ల శివ, తుమ్మల వెంగయ్య, నాయకులు ఎల్‌పీ మాలకొండారెడ్డి, అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మాశిలామణిని ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని అరెస్టు చేయాలి

వింజమూరు, జనవరి 4 : స్థానిక డాక్టర్ మాశిలామణిని ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్, ఏడీపీఎస్ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఎమ్మార్పీఎస్ దళిత సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకులు పందిటి అంబేద్కర్‌మాదిగ, ఏడీపీఎస్ జిల్లా నాయకులు గుజ్జు చెన్నయ్యలు మాట్లాడుతూ నియోజకవర్గంలో 35 సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మాసిలామణిని ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని అరెస్టు చేయకపోతే ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మంద సుజాతమాదిగ, ఎంఎస్పీ, దళిత సంఘాల నాయకులు పి నారాయణ, ఎన్ క్రిష్ణ, పి బాలకేశవులు, జి వెంగళరావు, జి రవీంద్ర, జి రాజా, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల మృతికి వెంకయ్య నాయుడు సంతాపం

ఉదయగిరి రూరల్, జనవరి 4: మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన తుమ్మల రమణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గురువారం వారి కుటుంబ సభ్యులకు సంతాప సందేశాన్ని పంపారు.

కనిగిరిలో చంద్రబాబు సభ..
భారీగా తరలిరండి : ఇంటూరి



మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జనవరి 4: కనిగిరిలో శుక్రవారం సాయంత్రం జరగనున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి దుర్మార్గపు, చేతగాని పరిపాలనకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందన్నారు. కంభం విజయరామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుపై రాష్ట్ర ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని, మరో మూడునెలల్లో ప్రజల ఆశలు ఫలించబోతున్నాయన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, వేముల గోపాలరావు, నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, ఎస్వీ సుబ్బారావు, చిలకపాటి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

● ఇంటూరికి న్యాయవాదుల వినతి

రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన భూమిహక్కుల యాజమాన్య చట్టాన్ని రద్దు చేసేలా పార్టీపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కందుకూరులో న్యాయవాదులు గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మల్లికార్జునరావు, ఎస్. పవన్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు బెజవాడ కృష్ణయ్య చౌదరి, వలేటి శ్రీధర్‌నాయుడు, చిడిపోతు హరికృష్ణ, బీవీ మురళీకృష్ణ, కె.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

● దివ్యాంగుల పాఠశాలలో జన్మదిన వేడుకలు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు చిన్న కుమారుడు సందీప్ తన జన్మదిన వేడుకలను గురువారం పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాలలో జరుపుకున్నారు. దివ్యాంగ చిన్నారుల సమక్షంలో కేకు కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

● నేడు టీడీపీలోకి బీజేపీ మహిళా నేత

కందుకూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మహిళామోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉన్నం నళినీదేవి శుక్రవారం టీడీపీలో చేరనున్నారు. కనిగిరిలో జరిగే బహిరంగ సభలో పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో ఆమె టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకున్నారు. గురువారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తును సర్వనాశనం చేసిన జగన్మోహన్ రెడ్డిని ఓడించటం లక్ష్యంగా టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నానని వివరించారు.

కావలిలో చెత్త వాహనాల అడ్డగింపు

● మున్సిపల్ కార్మికుల బైండోవర్, విడుదల ● వన్‌టౌన్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత



కందుకూరు : అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలిటౌన్, జనవరి4: మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా గురువారం చెత్తవాహనాలను అడ్డుకోవడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కార్మికులు సమ్మెతో ఎక్కడ చెత్త అక్కడే నిల్వచేరడంతో మున్సిపల్ కమిషనర్ కూలీలతో చెత్త వాహనాలను రంగంలో దించారు. విషయం తెలుసుకున్న కార్మికులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ట్రంకురోడ్డుపై వాహనాలను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. కమిషనర్ శ్రావణ్‌కుమార్ వన్‌టౌన్ స్టేషన్‌కు చేరుకుని మున్సిపల్ విధులకు కార్మికులు అటంకపరిచారని ఫిర్యాదు చేశారు. సీఐ రాజేష్, పోలీస్ సిబ్బంది ఆందోళన చేస్తున్న కార్మికులను అదుపులో తీసుకుని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతో కార్మికులు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకొని అక్కడ నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు కార్మికులను బైండోవర్ చేసుకుని విడుదల చేశారు. కాగా వాహనాలను అడ్డుకున్న కార్మికులపై కమిషనర్ ఫిర్యాదు చేయగా, పోలీసులు బైండవర్ చేసుకోవడం దారుణమని కార్మిక సంఘం నేతలు పేర్కొన్నారు. ఇలాంటి అరెస్టులకు నిర్బంధాలకు భయపడబోమని, ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఆందోళనలో ఏఐటీయూసీ నేతలు మల్లి అంకయ్య, కే. నాగరాజు, ఆదినారాయణ, సీఐటీయూ నేతలు పెంచలయ్య, తురకా శీనయ్య, రమేష్, మహిళా నేతలు పాల్గొన్నారు.

కందుకూరు : సీఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో పారిశుధ్య కార్మికులు రెండవ రోజు గురువారం నిరసన దీక్షలు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో రిలే దీక్షలను మున్సిపల్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసనలో ఏఐటీయూసీ నాయకులు బీ సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, రమణమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరింది. గురువారం వారు విధులను బహిష్కరించి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతను వీడి తక్షణం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు, ఏఐటీయుసీ మున్సిపల్ యూనియన్ నాయకులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

కావలి, జనవరి4: స్థానిక తుమ్మలపెంట రోడ్డులోని భవిత పాఠశాలలో గురువారం హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాష ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించారు. బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు దాత పెళ్లూరు భవిత సహకారంతో ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల జాతీయ సేవా రత్న అవార్డు అందుకున్న సయ్యద్ ఘనీబాషను మంగళగిరి వేణుగోపాల్, డీఎస్పీ ఎం. వెంకటరమణ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో గోవిందయ్య, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అజిత్‌బాబు, భవిత పాఠశాల ఉపాధ్యాయిని లక్ష్మీ, హజరత్తయ్య, క్రాంతి, జాగర్లమూడి, సాయి శివ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ పాలెంలో గడప గడపకు...



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్

బిట్రగుంట, జనవరి 4: బోగోలు మండలం చెన్నారాయునిపాలెంలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామ సర్పంచు కుమారి గిరిబాబు ఆధ్వర్యంలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్ఆర్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ఆస్తి ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో ఏపీ ఆప్కాప్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, ఎంపీపీ మేకల సుజాత, జడ్పీటీసీ ఎం కీర్తన, వైసీపీ నాయకులు వీరరఘు, శ్రీనివాసులు, పెంచలయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్కడినే ఎదుర్కోలేక కూటమి



పింఛన్ నగదు అందచేస్తున్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి

ఉలవపాడు, జనవరి 4 : రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ బాటలో నడిపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలు కూటమి కట్టాయని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి విమర్శించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ కష్టకాలంలో సంక్షేమ పథకాలను అందుకున్న ప్రతి పేదవాడి గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నాడని తెలిపారు. మండలంలో ఈ ఏడాది 110 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్ బ్రహ్మయ్య, ఎంపీడీవో ఎన్ విజయ, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో పసుపులేటి పర్యటన

బిట్రగుంట, జనవరి 4: బోగోలు మండలం తూర్పు తీరప్రాంతంలో గురువారం రాత్రి పీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ పర్యటించారు. జువ్వలదిన్నె పంచాయతీ పరిధిలోని పాత, కొత్త కడపాలాలు, అలిచర్ల బంగారుపాలెం, పాతపాలెం గ్రామాల్లో తిరుగుతూ స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్థులు పూలమాలతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు వెంకటేశ్వర్లు, భాను, పలువురు గంగపుత్రులు, పీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● దుప్పట్ల పంపిణీ

బోగోలు మండలం బిట్రగుంట గిరిజన కాలనీలో గురువారం హైదరాబాద్‌కు చెందిన శ్రీ రామదూత ట్రస్ట్ సభ్యుడు సత్యనారాయణ దాతృత్వంతో దుప్పట్లు అందచేశారు. స్థానికుడు రావి విజయ్‌కుమార్ వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు రావి పెంచలయ్య, పాలకుర్తి శ్రీనివాసులు, కార్తీక్, ప్రసన్న, రంగయ్య, మనోహర్, మజ్ను, నరేంద్ర పాల్గొన్నారు.

నర్సింగ్ స్కూల్‌లో విచారణ



విచారణ జరుపుతున్న డాక్టర్ ప్రియంవద

కందుకూరు, జనవరి 4: నర్సింగ్ విద్యార్థినులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా, వారు పరీక్షలు రాసే అవకాశాన్ని కోల్పోయేలా చేసిన కోటారెడ్డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రియంవద విచారణ నిర్వహించారు. బాధిత విద్యార్థినులతో, పాఠశాల యాజమాన్యంతో మాట్లాడిన ఆమె ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే మహీధర్ అభినందనీయుడు : నార్నె

కందుకూరు, జనవరి 4: చంద్రబాబును, లోకేష్‌ను తిడితేనే నీకు టికెట్ అంటూ సీఎం జగన్ పెట్టిన షరతును బేఖాతరు చేసిన కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అభినందనీయుడని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రెస్‌మీట్ పెట్టి చంద్రబాబు, లోకేష్‌లను విమర్శిస్తేనే టికెట్ ఇస్తానని సీఎం జగన్ చెప్పమన్నాడని మహీధరరెడ్డి వద్దకు వెళ్లిన దూతలతో ప్రెస్‌మీట్ పెట్టేపనే లేదు, అనవసరంగా చంద్రబాబును, లోకేష్‌ను విమర్శించనూ లేను.. టికెట్ ఇస్తారో ఇవ్వరో అది మీ ఇష్టం... అని తేల్చిచెప్పిన మహీధరరెడ్డిని వైసీపీ నేతలంతా ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు.

రూరల్ సీఐతో గౌడ్ సంఘం నేతల భేటీ

కావలి, జనవరి4: రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన కాటూరు శ్రీనివాసులును గురువారం సర్కిల్ కార్యాలయంలో మండల గౌడ్ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. గౌడ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డివిజన్ గౌడ్ సంఘం అధ్యక్షుడు పెనుకొండయ్య గౌడ్, కార్యదర్శి ఉప్పాల శ్రీనివాసులు గౌడ్, నేతలు నాసిన ప్రసాద్ గౌడ్, దాసరి నరసయ్య గౌడ్ పాల్గొన్నారు.

యూరియా కోసం ఎగబడిన రైతులు

అల్లూరు, జనవరి 4 : మండలంలో రబీ సీజన్‌కు అవసరమైన యూరియా కోసం రైతులు ఎగబడుతున్నారు. అల్లూరులోని ప్రైవేటు దుకాణాల్లో కొంతమంది రైతులకే యూరియా ఇస్తున్నారు. మిగిలిన రైతులు ఆర్బీకేల వద్దకు పరుగులు తీశారు. సొసైటీల్లో నిల్వలు లేకపోవడంతో చేసేదిలేక ఆర్బీకేల వైపు మళ్లారు. ఈ క్రమంలో అధికారుల అభ్యర్థన మేరకు సొసైటీలకు యూరియా రావడంతో రైతులు గురువారం సొసైటీల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో ఎమ్మార్పీకే యూరియా లభిస్తుండడంతో రైతులు ఆసక్తి కనపరిచారు. ఉన్న యూరియా బడా రైతులకు అందజేస్తుండడంతో సన్న,చిన్నకారు రైతులు తమకు అందడం లేదని విమర్శిస్తున్నారు.

పాఠశాలల తనిఖీ

కొండాపురం, జనవరి4: మండల పరిధిలోని పలు పాఠశాలలను ఎంఈవో-2 ఆనందరావు గురువారం తనిఖీ చేశారు. కొండాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డులను, విద్యార్థులు తింటున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే బోయళ్లవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రికార్డులను కచ్చితంగా నిర్వహించాలన్నారు.

గంధోత్సవాలకు విరాళం

బిట్రగుంట, జనవరి 4: గంధోత్సవ కమిటీకి పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణ గురువారం విరాళం అందచేశారు. కావలి వైకుంఠపురంలోని నాగూర్ మీరావలి గంధోత్సవానికి ఆమె రూ. 50 వేలను కమిటీ సభ్యులకు అందచేశారు. అలాగే కావలి రూరల్ మండలం ఆనెమడుగులో జరుగుతున్న గంధమహోత్సవానికి రూ. 70వేలను నిర్వాహకులకు ఇచ్చారు.

గిరిజనులకు హైజిన్ కిట్ల పంపిణీ

కావలి, జనవరి4: స్థానిక శాంతినగర్‌లో ఉంటున్న మిచౌంగ్ తుఫాన్ బాధిత గిరిజన కుటుంబాలకు గురువారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో హైజిన్ కిట్లను అందచేశారు. టార్పాలిన్లు, సబ్బులు, పేస్ట్‌లు, నూనెలు, శానిటరీ నాప్కిన్లతో కూడిన హైజిన్ కిట్లను వారికి ఇచ్చారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కార్యదర్శి ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ తుఫాన్‌తో ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు తక్షణ సామగ్రిని అందించామన్నారు. ఈ సామగ్రిని సమకూర్చిన, రాష్ట్ర, జిల్లా రెడ్‌క్రాస్ శాఖలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నేడు ఆరోగ్య సురక్ష

కలిగిరి, జనవరి4: మండలంలోని అనంతపురం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఫేజ్-2 వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, డాక్టర్ మస్తాన్‌బాబు తెలిపారు. సచివాలయం పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై స్పెషలిస్టు వైద్యులతో చికిత్సలు పొందాలని కోరారు. అలాగే కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు అందచేస్తామన్నారు.

వికసిత్ భారత్ యాత్రపై అవగాహన

లింగసముద్రం, జనవరి 4 : మండలంలోని పెదపవని, ముత్యాలపాడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై గురువారం లబ్ధిదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో యు శేషుబాబు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు ఈ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి టీ అబ్రహాం లింకన్, సచివాలయ సిబ్బంది, పలువురు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం !

- కంపుకొడుతున్న ఖాజానగర్, శాంతినగర్
- వ్యాధుల భయంతో ప్రజల ఆందోళన
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 4 : బుచ్చి నగర పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. ఇటీవల కురిసిన వర్షాలకుతోడు పూడికతీతకు నోచుకోని కాలువలు, అందులో పేరుకుపోయిన చెత్తాచెదారాలు కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణంలోని ఖాజానగర్, శాంతినగర్‌ల మీదుగా వెళ్లే కొత్త గుడపల్లి కాలువ ఏళ్ల తరబడి పూడికతీతకు నోచుకోలేదు. ఏళ్ల తరబడి మురుగునీరు పోయే మార్గం లేకపోవడం, అందులో పందుల సంచారంతో వెదజల్లుతున్న దుర్గంధంతో ప్రజలు వ్యాధులకు గురవుతున్నారు. ఇరిగేషన్ బంగ్లా వద్ద నుంచి బైపాస్ రోడ్డు వరకు, పాత గుడపల్లి కాలువ, హరివిల్లు లేఔట్ సమీపం నుంచి బైపాస్‌రోడ్డు వరకు, రేబాల కాలువ పరిధిలో రామకృష్ణానగర్, బేల్దారిపాళెం, మోహన్‌బాబు ఆసుపత్రి మీదుగా బైపాస్ రోడ్డు వరకు మురికి కూపాలుగా తయారైనా పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఖాజానగర్, శాంతినగర్‌లలో చాకలివీధి, తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు లేక ఇళ్ల ముందే మురుగుతో అవస్థలు పడుతూ దోమలతో సహవాసం చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు, నగర పంచాయతీ కమిషనర్‌తోపాటు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల సుబ్బారెడ్డినగర్‌లో కొత్తగా నిర్మించిన డ్రెయిన్ నాసిరకం నిర్మాణంవల్ల మురగు నీరు బయటకు వస్తుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువల్లో పూడికతీయించి దోమలు, వ్యాధుల బాధలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.





బుచ్చిలోని శాంతినగర్, ఖాజానగర్ ప్రాంతాల్లో దుస్థితిలో గుడపల్లి కాలువ

మురుగు కంపు, పందుల బెడదతో అల్లాడుతున్నాం..

శాంతినగర్‌లో గుడపల్లి కాలువ నుంచి వచ్చే మురుగు కంపు తట్టుకోలేకున్నాం. పందులు, దోమలు బెడదతో అల్లాడిపోతున్నాం. పిల్లలకు వ్యాధులొస్తాయోనని ఆందోళన. కౌన్సిలర్లకు, నాయకులకు, కమిషనర్‌కు, ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు.

- షేక్ షబీనా, శాంతినగర్

పీర్ల కాలువ, చుట్టు కాలవల పూడికతీత ఎవరికి ప్రయోజనం

నగర పంచాయతీ నడిబొడ్డులోని ప్రాంతాలు ఏళ్లతరబడి మురికికూపంలో ఉంటే అది గాలికొదిలేసి ఊరి చివరన జనావాసాలులేని పీర్లకాలువ, చుట్టుకాలువలో పూడికతీత లేఔట్లుకు తప్ప ఎవరికి ఉపయోగం లేదు. కమిషనర్ స్పందించి కాలువల్లో పూడికతీయించాలి.

- వింజం రామానాయుడు, శాంతినగర్

గిరిజన కుటుంబాలకు చేయూత

వెంకటాచలం, జనవరి 4 : మండలంలోని చవటపాళెం పంచాయతీలో తుఫాన్ కారణంగా నష్టపోయిన 45 గిరిజన కుటుంబాలకు గూంజ్, దేన్స్, ఎస్ఎఫ్‌డీ సంస్థల సహకారంతో రీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం సహాయం చేశారు. ఈసందర్భంగా ఒక్కో కుటుంబానికి పది కేజీల బియ్యం, కందిపప్పు, శెనగలు, టీపొడి, దుప్పటి, మ్యాట్ తదితర సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీడ్స్ సంస్థ అధ్యక్షుడు ఆరుముళ్ల మురళీ, గూంజ్, దేన్స్, ఎస్ఎఫ్‌డీ సంస్థల ప్రతినిధులు తిరుపతి రావు, బిషప్ స్వామి, కే యలీషకుమార్ తదితరులున్నారు.

మంచి ఫలితాలు సాధించాలి : డీఈవో

రాపూరు(డక్కిలి), డిసెంబరు 4 : విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి గంగాభవానీ సూచించారు. గురువారం రాపూరు మండలం తెగచర్ల ప్రభుత్వ పాఠశాలను ఆమె సందర్శించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబులు అందచేశారు. పాఠ్యాంశాలను సకాలంలో పూర్తిచేయాలని ఉపాధ్యాయలను ఆదేశించారు. 10వ తరగతి వార్షిక ఫలితాలు సంతృప్తి కరంగా వుండాలన్నారు. అనంతరం ఆమె గోనుపల్లి జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

అర్హులందరికీ పింఛన్ల పంపిణీ

తోటపల్లిగూడూరు, జనవరి 4: సర్వేపల్లి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం కొత్తకోడూరులో నూతన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, ఉపాధ్యక్షుడు కంజి లీలమ్మ, తోటపల్లిగూడూరు సొసైటీ అధ్యక్షుడు కావల్‌రెడ్డి హరిచంద్రరెడ్డి, ఉపసర్పంచ్ కావల్‌రెడ్డి రంగారెడ్డి, కావల్‌రెడ్డి రవీంద్రరెడ్డి, దిలీప్‌రెడ్డి, గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, జడ్పీటీసీ శేషమ్మ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

పొదలకూరు, జనవరి 4 : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పొదలకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కె శివనాయక్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని పలు పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాయక్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు అందు బాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ.వాసు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి జహీర్

మనుబోలు, జనవరి 4: మండలంలోని లక్ష్మీనరసింహపురం, చెర్లోపల్లి, మనుబోలులో ఉన్న ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ఎస్కే జహీర్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని దుకాణాల నిర్వాహకులను ఆదేశించారు. అలాగే ఆర్‌బీకేలు, సొసైటీలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎరువుల కోసం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ధర్మాసుపత్రిలో ఇదేం పాడుబుద్ధి!

- జీజీహెచ్‌లో ఎంఎస్‌వో, పారిశుధ్య కార్మికురాలి రాసలీలలు

నెల్లూరు (వైద్యం) : పేదల ధర్మాసుపత్రిగా పేరుగడించిన నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) రాసలీలల వీడియోలు అధికార వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో పారిశుధ్య కార్మికురాలిని మాత్రం విధుల నుంచి తొలగించారు. జనరల్ ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో బుధవారం మధ్యాహ్నం మేల్ నర్స్ ఆర్డినరీ (ఎంఎన్‌వో), ఓ పారిశుధ్య కార్మికురాలు నగ్నంగా ఉన్న సమయంలో పారిశుధ్య సూపర్‌వైజర్ తన సెల్‌ఫోన్‌లో వీడియో తీసినట్లు సమాచారం. ఈ వీడియోను అధికారులకు, ఆ తర్వాత ఉన్నతాధికారుల వరకు వెళ్లింది. ఈ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసి కార్మికురాలిని మాత్రం విధుల నుంచి తొలగించారు. అయితే, ఎంఎస్‌వోపై మాత్రం చర్యలు తీసుకునేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నట్లు తెలుస్తోంది.

సొంత మండలానికి సాగునీరు ఇవ్వలేని మంత్రి దేనికి..?

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



మొగళ్లూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సోమిరెడ్డి

పొదలకూరు, జనవరి 4 : సొంత మండలానికి సాగునీరు ఇవ్వలేని వ్యవసాయశాఖ మంత్రి మనకెందుకని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని మొగళ్లూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి పంటకే నీరు ఇవ్వకపోవడంతో మొగళ్లూరు నుంచి మరుపూరు వరకు బీడు భూములు కనిపిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా కండలేరు లిఫ్ట్ ఆన్ చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కనుపర్తి గ్రామానికి చెందిన 41 మంది గిరిజనులు ఈ సందర్భంగా సోమిరెడ్డిని కలిసి తమకు తుఫాను నష్టపరిహారంగా బియ్యం మాత్రమే అందించి నగదు ఇవ్వలేదని తమ గోడు వెలిబుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, మలిరెడ్డి చిన్నఓబుల్‌రెడ్డి, గజ్జల వెంకటేశ్వర్లు, పలుకూరు పాపిరెడ్డి, దశరథ, కూకట్ల వెంకటేశ్వర్లు, రమణయ్య, మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, అక్కెం సుధాకర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నం నాయుడు, బక్కయ్యనాయుడు, జమీర్, భాస్కర్‌రెడ్డి, మదిరిశ్ల నరసింహులు, వి రామకృష్ణ, ఆలుపూరు శ్రీనివాసులు, వెన్నపూస రాజారెడ్డి, పిన్నెల ప్రభాకర్, చిన్నా, డేగా యశ్వంత్‌రెడ్డి, ఆదాల సుగుణ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

జగదేవిపేట పీహెచ్‌సీ తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న స్టేట్ హెల్త్ డైరెక్టర్ పద్మావతి

ఇందుకూరుపేట, జనవరి 4: మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీని గురు వారం వైద్య, ఆరోగ్యశాఖ స్టేట్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ పద్మా వతి తనిఖీ చేశారు. ముందుగా వైద్య సిబ్బంది అటెండెన్స్ పరిశీలించి, పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం లాబరేటరీ రూమ్‌ను పరిశీలించి, అన్ని టెస్టులు చేస్తున్నారా.. లేదా? ఎక్విప్‌మెంట్స్ అన్ని కూడా పనిచేస్తున్నాయా.. లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. డెలివరీ రూమ్, పేషెంట్ వార్డు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు గురించి సిబ్బందిని అడిగారు. రోగులతో స్వయంగా మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీ కిషోర్‌కు మార్, జిల్లా న్యూక్లిస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్.సురేంద్ర, ఫిజియోథెరపిస్ట్ డీ.నరసింహులు, హెచ్ఈవో శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, డీపీఎంవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకులకే యూరియా : దినేష్



మాట్లాడుతున్న దినేష్‌రెడ్డి

కోవూరు, జనవరి4: అధికారపక్ష నాయకులకే యూరియా పంపిణీ చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కోనేటి కయ్యల ప్రాంతంలో గురువారం ప్రతి అడుగు ప్రజల కోసమే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పంట కాలువల్లో పూడిక తీయకుండా రైతుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రైతులు సొంత నిధులతో కాలువల్లో పూడిక తీయించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును సీఎంగా గెలిపించుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇంతామల్లారెడ్డి, బాలరవి, నాటకరాని వెంకట్, ధారా విజయబాబు, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, మదన్‌రెడ్డి, ఉయ్యూరు వేణు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

బహుజనుల రాజ్యాధికారం సాధిద్దాం



గ్రామస్థులతో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకీ ప్రసాద్

తోటపల్లిగూడూరు, జనవరి 4 : బహుజనుల రాజ్యాధికారం సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకిప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తపాలెం దళిత కాలనీలో గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం జానకిప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల కోసం పేద, మధ్య తరగతి ప్రజలు ఏకం కావాలని, వచ్చే ఎన్నికల్లో ఓటుతో అరాచక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రామచంద్రయ్య, శ్రీరాములు, హరిబాబు, ఎంబేటి విజయ్‌కుమార్, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షితల పంపిణీ

కోవూరు, జనవరి4: అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను గంగవరంలో భక్తులకు గురువారం పంపిణీ చేశారు. స్థానిక రామచంద్రాపురం కాలనీలోని వినాయకస్వామి ఆలయం నుంచి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించి, మహాలక్ష్మమ్మ ఆలయం ఎదుట భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు ఏడెం లక్ష్మీకుమారి, బీజేపీ నాయకులు సూరం వెంకటశేషా రెడ్డి, కరేటి సుబ్రహ్మణ్యం రెడ్డి, పామూరు గోపాల్‌రెడ్డి, అడ పాల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

జనసేన - టీడీపీ కలయికతో

భారీ మెజారిటీ : నారాయణ



ప్రజలతో మాట్లాడుతున్న నారాయణ, పక్కన కోటంరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 4: జనసేన, తెలుగుదేశం పార్టీల కలయికతో రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో భారీ మెజారిటీ చూపిద్దామని, ఉమ్మడి కార్యాచరణతో పనిచేసి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపిద్దామని మాజీ మంత్రి, టీడీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పొం గూరు నారాయణ పిలుపునిచ్చారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, చిరంజీవి యువత నాయకులు గురువారం నారాయణ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ నగరంలో ఎక్కడ తిరుగుతున్నా జనసేన, టీడీపీ కూటమికి ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏటూరి రవికు మార్, జిల్లా అధ్యక్షుడు ఈగి సురేష్, జనసేన నాయకుడు పీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశా..

నెల్లూరు(వ్యవసాయం) : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో తాను మంత్రిగా నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశానని మాజీ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 51, 54 డివిజన్లలో గురువారం జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుద్‌హుద్ తుపాను సమయంలో బాధ్యతగా పనిచేసి 24 గంటల్లోనే మొత్తం క్లియర్ చేశామని గుర్తు చేశారు. కానీ మొన్నటి మిచౌంగ్ తుపానుకి పడిపోయిన చెట్లని ఇప్పటి వరకు తొలగించలేదని విమర్శించారు. 2024లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, నగరంలో పెండింగ్ పనులన్నీ వందశాతం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నగరాన్ని చెత్తమయంగా మార్చిన ఘనత ఎమ్మెల్యే అనిల్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కరరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు ప్రశాంత్, అరవ కిషోర్, బూత్ కన్వీనర్లు, దాడి భాస్కర్, ఇందిరావతి, రాజేష్, హెండ్రి, అశోక్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రైతులకు మంచి రోజులు



రైతు కూలీలతో కలిసి బ్రోచర్లు చూపుతున్న సుజిత

నెల్లూరు రూరల్, జనవరి 4 : టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయ రంగానికి అన్నీ ప్రోత్సాహకాలు అందించిందని, వైసీపీ అధికారంలోకి వచ్చాక అవన్నీ కనుమరుగయ్యాయని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత అన్నారు. గురువారం నవలాకుల తోట, 4వ మైలు, అశోక్‌నగర్, 3వ మైలు ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్థానికంగా పొలాల్లో వ్యవసాయ కూలీలతో మాట్లాడారు. రైతులకు, రైతు కూలీలకు మళ్లీ మంచి రోజులు రావాలంటే తిరిగి రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె కుమార్తెలు లక్ష్మీహైందవి, సాయి వైష్ణవి పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 4: జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని చిన్నబజారులో గురువారం జనం కోసం జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రజలు, వ్యాపారస్తులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని, దుర్మార్గ వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, నాయకులు అజయ్‌బాబు, శ్రీనివాస్ ముదిరాజ్, ఉదయ్, కరీం తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులకు కరపత్రం అందిస్తున్న మనుక్రాంత్

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- న్యాయాధికారి వాణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు (విద్య), జనవరి 4 : విద్యార్థులెవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి కే వాణి తెలిపారు. ర్యాగింగ్ నిషేధ చట్టంపై నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 1997లో ర్యాగింగ్ నిషేధ చట్టాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఒక విద్యార్థికి అవమానం, భయం కలగడం, అవహేళనకు గురికావడం, మానసిక వేధింపులకు గురిచేయడం ర్యాగింగ్ నేరంగా పరిగణిస్తారన్నారు. ర్యాగింగ్ నిర్ధారణ అయితే కారకులకు ఆరునెలలు జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తారని చెప్పారు. విద్యార్థిపై దాడిచేస్తే ఏడాది జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తారని తెలిపారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ట్రాఫికింగ్, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు, హెచ్‌వోడీ డాక్టర్ కే మురళి, ఎన్‌సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కోడూరుపాడులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీ

నెల్లూరు రూరల్, జనవరి 4 : ప్రతి సంవత్సరం సంక్రాంతికి ముందు కోడూరుపాడులో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోడూరు కమలాకర్‌రెడ్డి తెలిపారు. కోడూరుపాడులోని సొసైటీ కార్యాలయం వద్ద గురువారం మీడియా సమావేశం నిర్వహించిన ఆయన పోటీల వివరాలు వెల్లడించారు. 6వ తేదీ ఉదయం 9 గంటలకు ఒంగోలు జాతి ఎడ్ల పోటీలు జరుగుతాయన్నారు. 30 జతల వరకు ఈ సారి పోటీల్లో పాల్గొనేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. ఏటా సంక్రాంతికి ముందు, జనవరి మొదటి వారంలో గ్రామ దేవత ఊళ్లమ్మకు అంగరంగ వైభవంగా కుంభాభిషేకం జరుగుతుందని, ఆ వేడుక ఈసారి 7వ తేదీన నిర్వహించ తలపెట్టామన్నారు.

వైభవంగా అనఘాష్టమి



అనఘా వ్రతం ఆచరిస్తున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 4 : నగరంలోని సుజాతమ్మ కాలనీ అవదూత దత్తపీఠం, అష్టలక్ష్మీ ఆలయంలో గురువారం అనఘాష్టమి వ్రతం వైభవంగా జరిగింది. విశేష పుష్పాలం కారం, పూజలు జరిగాయి. కార్యక్రమాన్ని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

బైజూస్‌తో ఒప్పందం రద్దు చేసుకోవాలి : ఏఐఎస్ఎఫ్

నెల్లూరు (విద్య), జనవరి 4 : బైజూస్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం రద్దు చేసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏఐఎస్ఎఫ్ నాయకులు హెచ్చరించారు. నెల్లూరులోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న బైజూస్ కోచింగ్ సెంటర్ ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ఆర్థిక నేరాలకు పాల్పడే బైజూస్ సంస్థతో ప్రభుత్వం వ్యాపారం చేయడం సిగ్గుచేటన్నారు. పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు సైతం ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి అక్రమ విద్యావ్యాపారం చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్ కిషోర్, నాయకులు శివం, నియాజ్, జీవన్, సాయి, చరణ్, గౌతమ్, అబ్దుల్, వెంకటేష్, గౌస్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను త్వరగా రెగ్యులర్ చేయాలి

- ఇంటర్ బోర్డు కమిషనర్‌కు ఎమ్మెల్సీ వినతి

నెల్లూరు (విద్య), జనవరి 4 : కాంట్రాక్ట్ లెక్చరర్స్ రెగ్యులరైజేషన్‌ను వేగవంతం చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటర్‌బోర్డు కమిషనర్ సౌరభ్ గౌర్‌కు విజ్ఞప్తి చేశారు. విజయవాడలో ఇంటర్‌బోర్డు కమిషనర్‌ను గురువారం కలిసిన ఎమ్మెల్సీ వినతిపత్రం అందచేసి మాట్లాడారు. జనరల్, ఒకేషనల్ కోర్సుల్లోని నాన్‌శాంక్షన్ పోస్టులకు, పార్ట్‌టైమ్ పోస్టులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే, పాఠశాల విద్య కమిషనర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్‌ను కలిసి పాలిటెక్నిక్ కళాశాలల్లోని కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న కేజీబీవీ సిబ్బంది, సీఆర్‌టీ, ఐఈఆర్టీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పార్ట్‌టైమ్ సిబ్బంది జీతాలను పెంచాలని కోరారు. గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు, గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న టీచర్ల వేతనాల పెంపుపై, ఉపాధ్యాయుల అంతర్‌జిల్లాల బదిలీలపై చర్చించి అందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీ సాధికార బస్సుయాత్ర పేరుతో రోడ్డు బ్లాక్

- అవస్థల్లో జనం



రాపూరు(డక్కిలి), డిసెంబరు 4 : రాపూరులో వైసీపీ ప్రభుత్వం తలపెట్టిన సాధికార బస్సు యాత్ర శుక్రవారం జరగనుంది. దీంతో వైసీపీ నాయకులు గురువారం ఉదయం నుంచే రోడ్డుని బ్లాక్ చేశారు. రోడ్డుకి అడ్డంగా స్టేజిని ఏర్పాటుచేసి వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో లారీలు, బస్సులు ఇరుకైన రోడ్డులో వెళ్లలేక ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందని స్థానికులు పెదవి విరుస్తున్నారు.

పింఛన్ పంపిణీ

నెల్లూరు(సిటీ), జనవరి 4 : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్ను లబ్ధిదారులకు కార్పొరేషన్ మేయర్ పోట్లూరి స్రవంతి అందచేశారు. గురువారం నెల్లూరు రూరల్లోని అల్లీపురం సచివాలయ పరిధిలోని వృద్ధులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. నెల్లూరు రూరల్లో ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యేని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసన్నకుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మురళిరెడ్డి పాల్గొన్నారు.

వరికి అధిక యూరియా అనర్థం : ఏడీఏ

నెల్లూరు రూరల్, జనవరి 4 : వరి సాగులో అధికంగా యూరియా వాడకం అనర్థమని నెల్లూరు వ్యవసాయ శాఖ ఏడీ ఎన్ శ్రీనివాసులు రైతులకు సూచించారు. గురువారం నెల్లూరు రూరల్లోని పెనుబర్తి, కలివెలపాళెం గ్రామాల్లో రైతులతో ఆయన మాట్లాడారు. వరిలో విచక్షణారహితంగా యూరియా వాడటం వల్ల రైతులకు ఆర్థిక భారంతో పాటు పంటకు అనర్థం తెచ్చిపెడుతుందన్నారు. వరి నాటిన 10 రోజుల తరువాత ఎకరా పొలంలో 35 కేజీలు, పిలకల దశలో మరో 35 కేజీలు, కరుకు దశలో ఇంకో 35 కేజీలు యూరియాను వాడితే సరిపోతుందని స్పష్టం చేశారు. ఇంతకు మించి వాడటం వల్ల భూమి కాలుషితమై పంటకు అనారోగ్యకరంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్వీ నాగమోహన్ కూడా పాల్గొన్నారు.

ఐజీ వస్తాడని అధికారుల పడిగాపులు

నెల్లూరు రూరల్, జనవరి 4 : గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తారన్న సమాచారంతో పోలీసు అధికారులు ఆయన రాకకోసం గంటల తరబడి ఎదురుచూశారు. నెల్లూరులో జరుగుతున్న పోలీసు శాఖ క్రీడలు గురువారం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి ఐజీని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ క్రమంలో రూరల్ పోలీసు స్టేషన్ తనిఖీ ఉంటుందని ఐజీ కార్యాలయం నుంచి సమాచారం రావడంతో అందరూ అప్రమత్తమయ్యారు. తీరా ఆయన రావడం లేదని తెలిసి వెళ్లిపోయారు.

చెరువుల్లో చేపల వేటకు వేలం పాటలు


నెల్లూరు రూరల్, జనవరి 4 : నెల్లూరు రూరల్లోని కొత్త వెల్లంటి, పాత వెల్లంటి, కందమూరు గ్రామాల్లోని చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కు కోసం గురువారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల ద్వారా రూ.11.36 లక్షల నిధులు పంచాయతీలకు సమకూరాయి. కొత్తవెల్లంటి చెరువును రూ. 3.20 లక్షలకు, పాత వెల్లంటి గ్రామంలోని రెండు చెరువులను ఒక్కోటి రూ.2.25 లక్షలకు, కందమూరు చెరువును రూ.3.66 లక్షలకు వేలం ద్వారా కేటాయించినట్లు మండల విస్తరణ అధికారి పెంచల శ్యాం తెలిపారు.

రెండేళ్లుగా వేధిస్తున్నారు!

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 4 : ఉపాధ్యాయుడిగా విద్యార్థుల భవిష్యత్ కోసం పనిచేస్తుంటే అది గిట్టని అధ్యాపకులు పోకిరీ విద్యార్థులతో తనను వేధిస్తున్నారని నగరంలోని మోడరన్ హైస్కూల్ (గుంట బడి) టీచరు పీ వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పాఠశాలలోని పీవీ నారాయణరావు, డీ పెంచలయ్య, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మునికృష్ణ తనపై దాడులు చేయడమేకాక అట్రాసిటీ కేసు, రేప్ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదని వాపోయారు.

7న మోపూరు చిత్రపటం ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 4 : మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య చిత్రపటం ఆవిష్కరణ ఈ నెల 7న జరుగుతుందని సరస్వతీ సమాజం చైర్మన్ మోపూరు పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిజాలక్ష్మి స్మారకోపన్యాసం, డాక్టర్ సూరం శ్రీనివాసులు సాహిత్యోపన్యాసం చేస్తారని తెలిపారు. అందరూ తరలిరావాలని కోరారు.



తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఎస్సీ, బీసీ, బలిజ, మైనారిటీ, మహిళా సిటింగు ఎమ్మెల్యేలలో తీవ్ర అలజడి నెలకొంటోంది. అదే సమయంలో ఓ కులానికి చెందిన బలమైన సిటింగు ఎమ్మెల్యేలు మాత్రం నిశ్చింతగా కనిపిస్తున్నారు. అధికార వైసీపీ అధిష్ఠానం తీరుతో తొమ్మిది నియోజకవర్గాల్లో సామాజికంగా వెనుకబడిన వర్గాలు తీవ్ర నిస్పృహకు లోనవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో టికెట్లు తిరిగి దక్కుతాయో లేదోనని ఈ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు తీవ్ర ఆందోళన చెందుతుండడం గమనిస్తున్న ఆయా వర్గాలు అధికార పార్టీ అధిష్ఠానంపై మండిపడుతున్నాయి. సిటింగు ఎమ్మెల్యేలకు చెందిన సామాజికవర్గాలను తక్కువగా చూస్తున్నందునే వారికి అవకాశాల పట్ల ఇష్టానుసారంగా ఆడుకుంటున్నారన్న భావనకు సంబంధిత వర్గాలు లోనవుతున్నాయి.

● నిశ్చింతగా ప్రాబల్య కులానికి చెందిన నేతలు

9మంది సిటింగుల్లో అలజడి

సామాజికంగా వెనుకబడిన కులాల నేతలతో వైసీపీ అధిష్ఠానం తీరు ఫలితం



తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో సత్యవేడు, జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలు, కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా పరిధిలోకి చేరిన గూడూరు, సూళ్ళూరుపేట వంటి ఐదు నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడుగా వున్నాయి. వీటికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు ఐదుగురూ అధికార పార్టీకి చెందిన వారే. గూడూరులో రిటైర్డు ఐఏఎస్ అధికారి వరప్రసాద్, సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్య, సత్యవేడులో కోనేటి ఆదిమూలం, జీడీనెల్లూరులో కళత్తూరు నారాయణస్వామి, పూతలపట్టులో ఎంఎస్ బాబులలో ఒక్కరంటే ఒక్కరికి కూడా టికెట్‌పై వైసీపీ అధిష్ఠానంనుంచీ స్పష్టమైన హామీ లభించలేదు. ఈ ఐదు చోట్లా అభ్యర్థులను మారుస్తారన్న ప్రచారం జరుగుతూండడంతో దాదాపుగా వీరందరూ తీవ్ర అభద్రతతో వున్నారు. వీరిలో సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేది లేదని చెప్పేసినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్యకు టికెట్ దక్కడం పట్ల అనుమానం వుండబట్టే ఎంపీ విజయసాయిరెడ్డిని నడిరోడ్డుపై అడ్డగించి అనుచరులతో తనకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేయించారు. ఈ ఐదుగురిలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి సహా ఎవరూ టికెట్ తనకే అని ధైర్యంగా చెప్పలేని పరిస్థితి. మదనపల్లె సిటింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు కూడా టికెట్ లేదని స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. దీంతో ఆయన కూడా నిర్వేదంలో వున్నట్టు సమాచారం. పలమనేరు సిటింగ్ ఎమ్మెల్యే వెంకటే గౌడ బీసీగా పరిగణించబడుతున్న సంగతి తెలిసిందే. అక్కడా ఆయనకు కాకుండా మాజీ మంత్రి అమరనాథరెడ్డిని ఓడించేందుకు బలమైన వ్యక్తిని పోటీ చేయించేందుకు వైసీపీ అధిష్ఠానం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏకైక బీసీ ఎమ్మెల్యేగా వున్న వెంకటేగౌడ దీంతో నైరాశ్యంలో కూరుకుపోయినట్లు సమాచారం. జిల్లాలో ఏకైక బలిజ ఎమ్మెల్యేగా వున్న చిత్తూరు ఆరణి శ్రీనివాసులుకు కూడా మొండిచేయి చూపారని, అక్కడ ఆయనకు ప్రత్యామ్నాయంగా రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో శ్రీనివాసులు కూడా నిస్పృహతో వున్నట్టు సమాచారం. జిల్లాలో ఏకైక మహిళా ఎమ్మెల్యేగా వున్న మంత్రి రోజా సైతం టికెట్‌పై ధీమాగా లేరు. అక్కడ మార్పు తప్పదన్న సంకేతాలుండడంతో జోరు తగ్గించిన ఆమె తనకు టికెట్ ఇవ్వకపోయినా సీఎం జగన్ కోసం త్యాగం చేసేందుకు సిద్ధమని తగ్గి మాట్లాడుతున్న పరిస్థితి. ఇలా తొమ్మిది నియోజకవర్గాల్లో ఎస్సీ, బీసీ, బలిజ, మైనారిటీ, మహిళ వంటి సామాజికంగా వెనుకబడిన సిటింగు ఎమ్మెల్యేలు అనిశ్చితిలో, అభద్రతతో సతమతమవుతున్నారు.

నిశ్చింతగా బలమైన నేతలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాకు సంబంధించి చూస్తే బలమైన నేతలు టికెట్‌పై నిశ్చింతగా వుండడం కనిపిస్తోంది. వెంకటగిరిలో సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, తిరుపతి సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరులో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లెలో ద్వారకనాథ రెడ్డి వంటివారు వచ్చే ఎన్నికలకు ధీమాగా సమాయత్తమవుతున్నారు. వారిలో టికెట్ మార్పు భయం ఏ కోశానా కనిపించడం లేదు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ బీసీ అయినప్పటికీ అక్కడ అంతకు మించిన ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఆయన నిక్షేపంగా వుండగలుగుతున్నట్టు సమాచారం. ఈ పరిణామాలు ఈ ప్రాంతాల్లోని సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, బీసీ, మైనారిటీ, బలిజ, మహిళా వర్గాలలో అధికార పార్టీ పట్ల తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. టికెట్ దక్కని ఆయా వర్గాల నేతలు కడుపుమండి అధిష్ఠానంపై విమర్శలకు దిగుతుంటే అధిష్ఠానం ఇతర నేతలతో వారిపై ఎదురుదాడి చేయిస్తుండడం ఆయా సామాజిక వర్గాలకు మింగుడు పడడం లేదు. బలహీనవర్గాల సిటింగు ఎమ్మెల్యేల రాజకీయ జీవితాలతో ఆడుకుంటున్న వైనం ఆ వర్గాల్లో ఆగ్రహావేశాలు రగిలిస్తున్నాయి. దీని పర్యవసానం వచ్చే ఎన్నిల్లో అధికార పార్టీపై ప్రతిఫలించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పూతలపట్టు వైసీపీలో సిగపట్లు

● తెరమీదకు మూడో పేరు



డాక్టర్ పూజారి లోకవర్ధన్

తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రిజర్వుడు నియోజకవర్గమైన పూతలపట్టు సీటు ఎవరికి కేటాయించాలనే విషయంలో వైసీపీ అధిష్ఠానం మరో ప్రత్యామ్నాయాన్ని పరిశీలిస్తోంది. పీలేరు నియోజకవర్గం కలికిరి పట్టణానికి చెందిన డాక్టర్ పూజారి లోకవర్ధన్ పేరు ముఖ్యనేతల ద్వారా అధిష్ఠానం దృష్టికి వెళ్ళింది. అక్కడ సిటింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు టికెట్ లేదని అధిష్ఠానం తేల్చి చెప్పేసిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ప్రత్యామ్నాయంగా తెరమీదకు వచ్చిన సంగతి తెలిసిందే. ఎంఎస్ బాబుకే టికెట్ ఇవ్వాలని ఓ వర్గం కోరుతుండగా ఆయనను పక్కన పెట్టి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌కు అవకాశం కల్పించాలని మరో వర్గం విజ్ఞప్తి చేస్తోంది. ఈ అంతరం క్రమేపీ పెరిగిపోయి సునీల్‌కుమార్‌కు టికెట్ ఇస్తే అతడికి సహకరించకూడదని ఎంఎస్ బాబు వర్గం నిర్ణయించుకున్నట్టు సమాచారం. అదే సమయంలో ఒకవేళ తిరిగి ఎంఎస్ బాబుకే గనుక టికెట్ కేటాయిస్తే అతడికి సహకరించరాదని ఆయన్ను వ్యతిరేకిస్తున్న వర్గం భావిస్తున్నట్టు తెలిసింది. ఇద్దరిలో ఎవరికి అవకాశమిచ్చినా ఓ వర్గం పనిచేయదన్న సమాచారం అధిష్ఠానానికి అందినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో అధిష్ఠానం ఇరువురినీ పక్కన పెట్టి అవసరమైతే మూడవ వ్యక్తిని రంగంలోకి దించాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఆ క్రమంలోనే కలికిరి పట్టణానికి చెందిన డాక్టర్ లోకవర్ధన్ పేరు అనూహ్యంగా తెరమీదకు వచ్చింది. సీనియర్ వైద్యుడైన ఆయన ప్రస్తుతం అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలతో సన్నిహిత సంబంధాలున్నాయి. దానికి తోడు ఆయన సతీమణి వైసీపీ తరఫున కలికిరి జడ్పీటీసీగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పేరు అధిష్ఠానానికి వెళ్ళినట్టు చెబుతున్నారు. పూతలపట్టులో పాతకాపుల కంటే కొత్త వారిని బరిలోకి దింపితే వర్గ విభేదాలు, అసంతృప్తులు వంటివి వుండవన్న భావనతో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిధున్ సైతం లోకవర్ధన్ పేరు సూచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. పూతలపట్టు నుంచీ వైసీపీ 2014లో డాక్టర్ సునీల్‌కుమార్‌కు తొలిసారి టికెట్ ఇవ్వగా ఆయన గెలిచారు. 2019లో సునీల్‌కుమార్‌ను పక్కన పెట్టి ఎంఎస్ బాబుకు టికెట్ ఇవ్వగా ఆయనా గెలిచారు. దీంతో కొత్త వారికి టికెట్ ఇస్తే గెలుస్తారన్న అభిప్రాయం ఆ పార్టీ వర్గాల్లోనూ వ్యక్తమవుతోంది. దీంతో రానున్న ఎన్నికల్లో సిటింగును, మాజీ ఎమ్మెల్యేని కాదని కొత్త వ్యక్తిని పోటీకి దింపాలన్న ఈ ప్రయత్నం ఎంతవరకూ సఫలీకృతమవుతుందో, దీనిపట్ల పూతలపట్టు నియోజకవర్గ వైసీపీ నాయకులు, శ్రేణులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సివుంది.

ఎవరికి టికెట్ వచ్చినా గెలిపించుకుందాం

తిరుపతిలో బలిజ ప్రముఖుల సమావేశంలో తీర్మానం

తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరున భారీ ఎత్తున వన భోజనాలు నిర్వహించాలి... వచ్చే ఎన్నికల్లో సామాజికవర్గం నుంచీ ఎవరికి టికెట్ దక్కినా కలసికట్టుగా గెలిపించుకోవాలి... ఇవీ గురువారం తిరుపతిలో జరిగిన బలిజ ప్రముఖుల సమావేశంలో చేసిన తీర్మానాలు. తిరుపతి ఎన్జీవో కాలనీలోని బాస్ (బలిజ అభ్యుదయ సేవా సంఘం) కార్యాలయంలో టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బలిజ సామాజికవర్గానికి చెందిన పలువురు ముఖ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏటా నిర్వహించే తీరులోనే ఈ ఏడాది కూడా వనభోజనాలు నిర్వహించే విషయమై తొలుత చర్చించారు. తిరుపతి నగరంతో పాటు చంద్రగిరి, శ్రీకాళహస్తి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్ళపల్లి, పీలేరు, రైల్వే కోడూరు తదితర ప్రాంతాల నుంచీ కూడా భారీ ఎత్తున బలిజ సామాజికవర్గాన్ని వనభోజనాలకు ఆహ్వానించాలని నిర్ణయించారు. కనిష్ఠంగా పది వేల నుంచీ గరిష్ఠంగా పదిహేను వేలమందితో ఘనంగా జరపాలని నిశ్చయించారు. ఎక్కడ నిర్వహించాలన్న దానిపై ఒకటి రెండు స్థలాలు చూశాక నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా ఎన్నికలు రెండు నెలల సమీపానికి వచ్చిన నేపథ్యంలో రాజకీయంగానూ చర్చ జరిగింది. టీడీపీ, జనసేన పార్టీల నడుమ పొత్తు కుదిరిన నేపథ్యంలో ఉమ్మడి అభ్యర్థిగా బలిజల్లో ఎవరికి అవకాశం వచ్చినా అందరూ కలసికట్టుగా గెలిపించుకోవాలన్న ప్రతిపాదన వచ్చిందని, సమావేశానికి హాజరైన ముఖ్యులందరూ ఈ ప్రతిపాదనను మూకుమ్మడిగా ఆమోదించినట్టు తెలిసింది. వైసీపీలో బలిజ సామాజికవర్గానికి ఎమ్మెల్యే టికెట్ అవకాశం లేని నేపథ్యంలో టీడీపీ, జనసేన పార్టీల్లోనే అవకాశాలున్నాయని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడినట్టు సమాచారం. అందువల్లే సమావేశానికి ప్రధానంగా ఆ రెండు పార్టీలకు చెందిన నాయకులు అందరూ హాజరైనట్టు తెలిసింది. రాజకీయపరమైన చర్చలకు, నిర్ణయాలకు సంబంధించి తరచూ సమావేశం కావాలని, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించుకున్నట్టు తెలిసింది. కాగా సమావేశానికి టీడీపీ నుంచీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రమణ్యం, జనసేన నుంచీ డాక్టర్ హరిప్రసాద్, కిరణ్ రాయల్, ఎడిపై స్కూలు కరస్పాండెంట్ ప్రణీత్ తదితరులతో పాటు పలువురు రిటైర్డు ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించమంటే

విధులకు రమ్మంటారా?

● ప్రభుత్వ నోటీసు ప్రతులను దహనం చేసిన అంగన్వాడీలు



తిరుపతిలో ప్రభుత్వ నోటీసు ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారంతో 24 రోజులకు చేరుకుంది. తిరుపతి సహా జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలున్న చంద్రగిరి, పుత్తూరు, పిచ్చాటూరు, సత్యవేడు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి, కోట తదితర చోట్ల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. నాయుడుపేటలో రిలే దీక్షా శిబిరంలో ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు వేపాకులు చేతబట్టుకుని వైసీపీ ప్రభుత్వానికి దెయ్యం పట్టిందని, దెయ్యాన్ని వదిలిస్తామంటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తిరుపతి, పిచ్చాటూరు, పుత్తూరుల్లో రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్న ఉద్యోగులకు శుక్రవారం నుంచీ విధులకు హాజరు కావాలంటూ ఆయా సీడీపీవోలు నోటీసులు జారీ చేశారు. అయితే ఆ నోటీసు ప్రతులను తమ శిబిరాల ఎదుట తగులబెట్టిన ఉద్యోగులు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే దాకా విధుల్లో చేరే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కాగా కోట మండల కేంద్రంలో అంగన్వాడీ ఉద్యోగుల రిలే దీక్షకు చిన్నారులు హాజరై మద్దతు ప్రకటించగా పిచ్చాటూరులో ఉద్యోగులు సోది చెబుతూ నిరసన తెలిపారు. సత్యవేడులో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే ఆదిమూలాన్ని కలసి అంగన్వాడీ ఉద్యోగులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

చెత్తకుప్పల తొలగింపుపై ఉద్రిక్తత

సూళ్లూరుపేటలో ట్రాక్టర్లను అడ్డుకున్న పారిశుధ్య కార్మికులు

సీఐటీయూ నాయకుల అరెస్టు

సూళ్లూరుపేట, జనవరి 4: సూళ్లూరుపేట పట్టణ వీధుల్లో చెత్తకుప్పల తొలగింపు విషయమై గురువారం తీవ్ర వివాదం నెలకొంది.పారిశుధ్య కార్మికులు 10 రోజులుగా సమ్మె చేస్తుండడంతో మున్సిపాలిటీ పరిధిలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి.ఈ నేపథ్యంలో గురువారం ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు ప్రైవేట్ కూలీలను పెట్టి పురవీధుల్లో చెత్తను తొలగించేందుకు పూనుకున్నారు.ఈ సమాచారం తెలుసుకొన్న పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు ఎర్రజెండాలు చేతపట్టుకొని చెత్తను తరలించే ట్రాక్టర్లను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో కార్మికులు, పోలీసులు, కౌన్సిలర్ల నడుమ తోపులాటలు జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగప్రవేశం చేసి సీఐటీయూ నాయకులను స్టేషన్‌కు తరలించారు. దీంతో కాసేపు కార్మికుల నిరసనలతో పట్టణ వీధులు హోరెత్తాయి. చివరకు కార్మికులు స్టేషన్‌కు చేరుకొని అరెస్టు చేసిన సీఐటీయూ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు.ఈలోపు ప్రైవేట్ కూలీల చేత వీధుల్లో చెత్తను తొలగించారు.మధ్యాహ్నంపైన సీఐటీయూ నాయకులను పూచీకత్తుపై పోలీసులు పంపించేశారు.



చెత్త తొలగింపును అడ్డుకొంటున్న కార్మికులు

కాంగ్రెస్‌లో ఎవరు చేరినా

మాకు ప్రత్యర్థులే

● వైఎస్ షర్మిలను ఉద్దేశించి మంత్రి పెద్దిరెడ్డి


● ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పార్టీని విమర్శించడం సబబు కాదని వ్యాఖ్య

చిత్తూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్‌లో ఎవరు చేరినా సరే మా రాజకీయ ప్రత్యర్థిగానే చూస్తాం. రాజకీయాల్లో మా కాళ్లను మేమే నరుక్కోం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరడంపై మీడియా ప్రతినిధులు మంత్రి స్పందనను కోరగా.. ఆయన పైవిధంగా స్పందించారు. చిత్తూరులో గురువారం జరిగిన పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. కాంగ్రెస్‌లోకానీ, టీడీపీలోకానీ తమ పార్టీకి, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా పనిచేసేవారిని ప్రతిపక్షంగానే చూస్తామన్నారు. వైసీపీలో దళిత ఎమ్మెల్యేలకు విలువ లేదని, సర్వే పేరుతో టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, వ్యతిరేకత ఉన్నా ఓసీలకు మళ్లీ సీట్లు ఇస్తున్నారని ఇటీవల పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చేసిన విమర్శలను మంత్రి పెద్దిరెడ్డి వద్ద మీడియా ప్రతినిధులు ప్రస్తావించారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. 'ఎంఎస్ బాబు ఆత్మ విమర్శ చేసుకోవాలి. జడ్పీటీసీగా ఓడిపోయిన వ్యక్తిని ఏ విధంగా తీసుకొచ్చి ఎమ్మెల్యేగా గెలిపించామనేది గుర్తు చేసుకోవాలి. ఇంగితజ్ఞానం లేకుండా ఎవరో చెప్పిన మాటలు విని రెచ్చిపోయి మాట్లాడటం సబబు కాదు. ఇప్పటికైనా ఆయన తప్పు తెలుసుకుని వైసీపీ కోసం పనిచేయాలి' అని పేర్కొన్నారు.

నేడు రంగవల్లుల పోటీలు

ABN ఆంధ్రజ్యోతి

నెల్లూరు, కావలి, గూడూరులలో నిర్వహణ



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అభిమాన పాఠకులైననారీమణుల కోసం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో శుక్రవారం ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన" సారథ్యంలో నెల్లూరులోని చందన బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ మైదానం, కావలిలో కార్పొరేషన్ రీడింగ్ రూమ్, గూడూరులోని సనత్‌నగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఈ పోటీలు జరగనున్నాయి. మధ్యాహ్నం న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేసి, అతిథులు బహుమతులు అందజేయనున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి



నాయుడుపేటలో ప్రభుత్వానికి పట్టిన దెయ్యాన్ని వదిలిస్తామంటున్న అంగన్వాడీలు - సూళ్లూరుపేటలో గొడుగులతో నిరసన

గూడూరు, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీలు అన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించాలని 24రోజులుగా దీక్ష చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఇంద్రావతి, శివకుమార్, సురేష్, ప్రసాద్, చంద్రయ్య, ప్రభావతి, పెంచలమ్మ, ప్రసన్న, మునికుమారి, లక్ష్మి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: బంగారుపేట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న దీక్ష గురువారం 24వ రోజు కొనసాగింది. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చమని అంగన్వాడీ కార్యకర్తలు రోడెక్కితే, సమస్యలు పరిష్కరించి ఆందోళన విరమింప చేయాల్సిన పాలకులు సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపారాణి, సుభాషిణి, మంజుల, ఐఎఫ్‌టీయూ నేతలు మమ్ములాబేగం, లక్ష్మీప్రసన్న, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న అంగన్వాడీలకు చిన్నారులు, వారి తల్లులు మద్దతు ప్రకటించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లతో కలిసి చిన్నారులు, వారి తల్లులు జెండాలు చేతపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నాయుడుపేట టౌన్: ప్రభుత్వానికి పట్టిన దెయ్యాన్ని వదిలిస్తామంటూ అంగన్వాడీలు వినూత్నరీతిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి పట్టిన దెయ్యం వదలందే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కావని, ఆ దెయ్యాన్ని వదలగొడుతామని చెప్పారు. అంగన్వాడీ కార్మికుల సంఘం కార్యదర్శి శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్న అంగన్వాడీలు గురువారం గొడుగులు వేసుకొని నిరసన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు హైమావతి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించమని ప్రభుత్వాన్ని అడుగుతుంటే, విధుల్లో పాల్గొనకుంటే చర్యలు తీసుకొంటామని బెదిరించడం అన్యాయమన్నారు. తమ డిమాండ్లను అంగీకరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు.

చంద్రబాబు సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జనవరి 4: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9న వెంకటగిరిలో నిర్వహించనున్న రా... కదలిరా... బహిరంగ సభ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సభకు తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి లక్ష మంది వచ్చేలా జనసమీకరణ చేస్తున్నామని చెప్పారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామని, సభా ప్రాంగణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు సమకూరుస్తున్నట్లు కురుగొండ్ల తెలిపారు. ఆయన వెంట జనసేన నాయకుడు గూడూరు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, గల్లా శ్రీనివాసులు, వలస రాఘవరెడ్డి, తాండవ చంద్రారెడ్డి, నరసింహులు, శ్రీను, గురువేంద్ర, మంకు ఆనంద్, చలపతి తదితరులు ఉన్నారు.

దళితులపై వివక్ష చూపుతున్న వైసీపీ: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, జనవరి 4: దళితుల పట్ల వైసీపీ వివక్ష చూపుతోందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇసుక, గ్రావెల్ దోపిడీ చేసింది మంత్రులు, ప్రభుత్వ పెద్దలైతే ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలను బలిపశువులు చేశారని ఆయన విమర్శించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఎక్కువ మందికి టికెట్లు ఇవ్వడంలేదని విమర్శించారు. దళితులే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. టీడీపీ హయాంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని, చంద్రబాబునాయుడు నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాలకు, నిరుద్యోగులకు, రైతాంగానికి న్యాయం జరుగుతుందని విశ్వశిస్తున్నామన్నారు. ఈనెల 9వ తేదీ వెంకటగిరిలో జరిగే 'రా కదిలిరా' బహిరంగసభను నియోజకవర్గంలోని నాయకులు, నేతలు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీరామ్‌ప్రసాద్, శంకరయ్య, మురళీరెడ్డి, అశోక్‌రెడ్డి, విజయకుమార్ నాయుడు, శ్రీనివాసులునాయుడు, కిష్టయ్య, శేఖర్‌నాయుడు, అవధానం సుధీర్, ప్రసాద్‌నాయుడు, కోటి, రమణయ్య, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

గూడూరు, జనవరి 4: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని జిల్లా పార్టీ అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో హర్షణీయమన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, రాక్షస పాలనకు మంగళం పాడడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరడంతో సంతోషం వ్యక్తం చేస్తూ స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద నాయకులు బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జనవరి 4: సామాజిక న్యాయమే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక 16వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ రాధ, వైసీపీ పట్టణ కన్వీనర్ డిల్లీబాబు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహనకే వికసిత్ భారత్ సంకల్పయాత్ర

దక్కిలి, డిసెంబరు 4: కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకే వికసిత్ భారత్ సంకల్పయాత్ర చేపట్టినట్లు వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. గురువారం దక్కిలి సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై అధికారులు లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. అనంతరం ప్రధాని మోదీ ఫొటోతో ముద్రించిన క్యాలెండరు, తొమ్మిదేళ్ల బీజేపీ పాలనపై కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో యోగేశ్వరరావు, బాలకృష్ణ, గుండాలు, శ్రీరాం శంకరనాయుడు, గోపాల్ పాల్గొన్నారు.



తుపాను కారణంగా దెబ్బతిన్న ఓజిలి పెద్దచెరువు కట్ట, ఆర్అండ్‌బీ రోడ్డు - రెండు రోజుల కిందట దెబ్బతిన్న ప్రాంతంలో మట్టి నింపిన దృశ్యం

చెరువు కట్టను మట్టితో కప్పివేశారు!

ఓజిలి, జనవరి 4: గత ఏడాది డిసెంబరులో సంభవించిన తుపాను ప్రభావంతో ఓజిలి పెద్దచెరువు కట్ట, దానిమీదుగా వెళుతున్న ఆర్అండ్‌బీ రోడ్డు దెబ్బతింది. చెరువు నీటి ప్రవాహం రోడ్డును దాటుకుంటూ తూర్పువైపు వరవలోకి ప్రవహించడంతో రోడ్డుతో పాటు చెరువు కట్ట కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో కొన్ని రోజుల పాటు రాకపోకలు నిలిపివేశారు. రెండు రోజుల కిందట అధికారులు దెబ్బతిన్న కట్ట, రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. చెరుకట్టకు దిగువ ప్రాంతంలోని మట్టిని ఎక్సకవేటర్ ద్వారా తీసి కోతకు గురైన రోడ్డు, కట్టను కప్పేసి చేతులు దులుపుకున్నారు. దీనివల్ల కట్ట మళ్లీ కుంగిపోయే ప్రమాదం ఉందని, భారీ వాహనాలు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల కడుపుకొట్టే పనులు వద్దు



గూడూరులో ప్రైవేటు కార్మికులను అడ్డుకుంటున్న పారిశుధ్య కార్మికులు - నాయుడుపేటలో ర్యాలీ

గూడూరు, జనవరి 4: తమ సమస్యల సాధన కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అండగా నిలవకపోగా, ఇతర కార్మికులతో పనులు చేయించి తమ కడుపుకొట్టేలా ప్రవర్తించడం పద్ధతి కాదని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు గోపీనాథ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 10వ రోజు కొనసాగింది. స్థానిక సొసైటీ కాలనీలో పనులు చేస్తున్న ఇతర కార్మికులను పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. దీంతో కొంత సేపు పనులు చేయిస్తున్న వారికి, మున్సిపల్ కార్మికులకు వాగ్వాదం చోటుచేసుకుంది. పనులు చేస్తున్న కార్మికులు వెళ్లిపోవడంతో వివాదం సర్దుమణిగింది. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ సొసైటీకాలనీ ప్రాంతంలో ఎమ్మెల్యే అనుచరులు, సచివాలయ సిబ్బంది పోటీగా కార్మికులను తీసుకువచ్చి పనులు చేయిచడం తమ కడుపు కొట్టడమేనన్నారు. పది రోజులుగా కుటుంబాలను సైతం వదిలి సమ్మె చేస్తుంటే కార్మికులను రెచ్చగొట్టే విధంగా బయట నుంచి ఇతర కార్మికులను తీసుకువచ్చి పనులు చేయించడం మానుకోవాలన్నారు. పది రోజులుగా దీక్ష చేస్తున్నా శిబిరం వద్దకు ఎమ్మెల్యే వచ్చి తమను పరామర్శించి, సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, రమణయ్య, పెంచలప్రసాద్, మురళి, రమేష్, కోటేశ్వరరావు, రాఘవయ్య, మణెమ్మ, ధనమ్మ, పూర్ణ, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశధ్య కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం 10వ రోజు కొనసాగింది. సీఐటీయూ నాయకులు వట్టిపల్లి చెంగయ్య, ప్రసాద్, సుబ్బయ్య, ఏఐటీయూసీ నేతలు కల్లూరి జాన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని సీఐటీయూ నాయకుడు చాపల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వరకు పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రాత్రి వేరే కార్మికుల చేత వీధులను శుభ్రపరుస్తున్నారని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లిన పారిశుధ్య కార్మికులపై వైసీపీ మూక దాడికి పాల్పడడం దుర్మార్గమన్నారు. భవిష్యత్తులో కార్మికులపై దాడులు జరిపితే తీవ్ర పరిణామాలు చూడాల్సివస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, పారిశుధ్య కార్మికులు మస్తానయ్య, లచ్చమ్మ, తేజ, మధు తదితరులు ఉన్నారు.

ఆటో ఢీకొని సైక్లిస్టు మృతి



మృతిచెందిన ముత్యాలయ్య

గూడూరు, జనవరి 4: ఆటో ఢీకొనడంతో సైక్లిస్టు వ్యక్తి మృతి చెందిన సంఘటన పోటుపాళెం జాతీయ రహదారి సమీపంలోని చిల్లకూరు వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... చిల్లకూరుకు చెందిన ముత్యాలయ్య(49) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం పనులకు వెళ్లేందుకు సైకిల్‌పై బయలుదేరాడు. పోటుపాళెం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా చిల్లకూరుకు చెందిన గోపి ఆటోలో వెళ్తూ అదుపుతప్పి సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముత్యాలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గణతంత్ర వేడుకలకు ఎన్‌బీకేఆర్ విద్యార్థి



అభినయ్ కీర్తన్‌పాల్

కోట, జనవరి 4: న్యూ ఢిల్లీలో ఈనెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు స్థానిక ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి అభినయ్ కీర్తన్‌పాల్ ఎంపికయ్యాడని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. గురువారం అభినయ్ కీర్తన్‌పాల్‌ను అభినందించారు.

అదృశ్యమైన యువతి అప్పగింత

నాయుడుపేట టౌన్, జనవరి 4: నెల్లూరులోని సంతపేటకు చెందిన ఓ యువతి డిసెంబరు 28వ తేదీ అదృశ్యమైంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ఆ యువతి నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌కు రావడంతో సంతపేట పోలీసులకు అప్పగించారు.

ఎమ్మెల్యే వస్తున్నారని టీడీపీ ఫ్లెక్సీల తొలగింపు

ఓజిలి, జనవరి 4: ఓజిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను గురువారం అధికారులు తొలగించారు. టీడీపీ నేతలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ శ్రేణులు రెండు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాయి. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యేచే పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన వస్తున్నారంటూ ఈవోపీఆర్‌డీ మోహన్ సూచన మేరకు పంచాయతీ కార్యదర్శి సిరాజ్ ఫ్లెక్సీలను తీసివేయించారు. ఎమ్మెల్యే కార్యక్రమానికి వచ్చిన పలువురు వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఫ్లెక్సీలను తొలగించాల్సిన అవసరం ఏముందంటూ అధికారుల అత్యుత్సాహాన్ని తప్పుపట్టారు.

జయహో బీసీ సభకు టీడీపీ నేతలు

గూడూరు, జనవరి 4: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ సభకు గూడూరు నియోజకవర్గం నుంచి ఆ పార్టీ బీసీ నాయకులు తరలివెళ్లారు. మంగళగిరి వెళ్లిన వారిలో బిల్లు చెంచురామయ్య, బాలకృష్ణ యాదవ్, తీగల సురేష్‌బాబు, మధుయాదవ్, కోటేశ్వరప్రసాద్, ధనుంజయ గౌడ్, చెంచురామయ్య, ప్రతాప్, కుమార్, శేఖర్, శ్రీకాంత్ ఉన్నారు.

చంద్రబాబును కలిసిన టీడీపీ నేతలు

పెళ్లకూరు, జనవరి 4: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు కొచ్చెర్ల వెంకటరమణ నాయుడు (కేవీ నాయుడు) మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ నాయకులు వెంపళ్ల వెంకటేశ్వర్లు, కానూరు ప్రసాద్‌రాజు తదితరులు చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు. అలాగే పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవిని కలిశారు.

బీమా నగదు అందజేత

పెళ్లకూరు, జనవరి 4: మండలంలోని పునబాక దళితవాడకు చెందిన పైపూరు శంకరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి భార్య మునెమ్మకు రూ.10వేల వైఎస్సార్ బీమా నగదును ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు చిత్ర, ఎంపీటీసీ కన్నలి కుమార్‌స్వామి, నాయకులు నర్రావుల లింగంనాయుడు, అట్ల కృష్ణయ్య, పాలూరు వెంకటరమణారెడ్డి, నీలం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పూరిగుడిసె దగ్ధం

తడ, జనవరి 4: ఇరకందీవి పాళెంతోపుకుప్పంలో పూరిగుడిసె దగ్ధమైంది. మత్స్యకార కుటుంబానికి చెందిన కన్నమ్మ బుధవారం రాత్రి తన పూరిగుడిసెలో దీపం వెలిగించింది. అర్ధరాత్రి సమయంలో మంటలు రేగడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని వస్తువులు, బట్టలు అగ్నికి ఆహుతయ్యాయి.

తీరప్రాంతంలో అంబులెన్సు సేవలు



అంబులెన్సును ప్రారంభిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

చిల్లకూరు, జనవరి 4: తీరప్రాంత ప్రజలకు అంబులెన్సు సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఆర్డీవో కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని వరగలి పీహెచ్‌సీలో జేఎస్‌పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిందాల్ పరిశ్రమ దాతృత్వంతో అందజేసిన అంబులెన్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను దగ్గరలోని ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించేందుకు అంబులెన్సును అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో సూర్యసాయి, శ్రీనివాసరావు, డాక్టర్ గీతావాణి, డాక్టర్ ప్రతీత్, మన్నారి, సరోజ్‌పాడి, విల్సన్, మాథ్యూ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించి అభివృద్ధికి బాటలు వేద్దాం



కేశవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 4: టీడీపీని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి బాటలు వేద్దామని ఆ పార్టీ నాయకులు అన్నారు. గురువారం మండల పరిధిలోని కేశవరంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు బీసీ కాలనీ, అరుంధతీయవాడలో ఇంటింటికీ వెళ్లి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అలాగే గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే పాశం సునీల్‌కుమార్‌ను అత్యధిక మేజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, బీసీ సెల్ అధ్యక్షుడు చాపల మస్తానయ్య, చంద్రశేఖర్, అనిల్, పిండి వెంకటకృష్ణయ్య, జడ వేణు, కసుమూరు వెంకటేశ్వర్లు, బాబు, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి



పాలీశ్వరన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వేనాటి సతీష్ రెడ్డి

తడ, జనవరి 4: మండల పరిధిలోని వేనాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కె.పాలీశ్వరన్ (57) మృతి చెందాడు. టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, తెలుగు యువత నేత చింతల సతీష్‌చంద్ర తదితరులు పాలీశ్వరన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఇందులో టీడీపీ నాయకులు సుదర్శన్‌రావు, శ్రీరాములు, పూడి శెల్వం, బొమ్మన్ పళణి, వేనాటి జనార్ధన్ రెడ్డి, గండవరం రమేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే దేశం సుభిక్షం

వెంకటగిరి టౌన్, జనవరి 4: బీజేపీతో పాలనతోనే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. గురువారం మండల పరిధిలోని పాపమాంబపురంలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. అనంతరం మోదీ క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వడ్డి శివకోటి, తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, జనవరి 4: సమ్మె చేస్తున్న తమపై రౌడీమూకలు దాడి చేశాయంటూ పారిశుధ్య కార్మికులు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి మున్సిపల్ అధికారులు వేరే కార్మికుల చేత చెత్త తరలిస్తుండటంతో సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. అదే సమయంలో రౌడీమూకలు తమపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.